నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
నిజామాబాద్-కామారెడ్డి
మంగళవారం | ఏప్రిల్ 30, 2024 | www.navatelangana.com

పిచ్చికుక్క దాడిలో 26 మందికి గాయాలు

నవతెలంగాణ-బిచ్కుంద

బిచ్కుంద మండల కేంద్రంలో పిచ్చికుక్క స్వైర విహారం చేసింది. వీధుల్లో తిరుగుతూ ఆడుకుంటున్న పిల్లలను, రోడ్డు వెంట ఉన్న పెద్దలను కరవడంతో సుమారు 26 మంది గాయాల పాలయ్యారు. గాయపడిన వారిని స్థానికులు చికిత్స నిమిత్తం బిచ్కుంద ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పిచ్చికుక్క ఎదురు వచ్చిన వారిని కరుస్తూ భయభ్రాంతులకు గురి చేయడంతో కోపోద్రిక్తులైన అయిన స్థానికులు పిచ్చికుక్కను వెంటాడి కొట్టి చంపారు. బిచ్కుంద మండల కేంద్రంలో ప్రతి వీధిలో కుక్కల బెడద ఎక్కువైందని విధులలో తిరుగుతున్న కుక్కలు ఎటువైపు నుంచి వచ్చి చిన్న పిల్లలను కరుస్తాయోనని తల్లిదండ్రులు భయపడుతున్నారు. ఎన్నోసార్లు స్థానిక గ్రామపంచాయతీలోని అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. మున్ముందు ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా గ్రామపంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వాహన తనిఖీల్లో 2.1 కిలోల గంజాయి పట్టివేత

నవతెలంగాణ-(వేల్పూర్)ఆర్మూర్

విశ్వసనీయ సమాచారం మేరకు మండలంలోని వెంకటాపూర్ రోడ్డులో గల సాయి కృష్ణ రైస్ మిల్ దగ్గర అనుమానస్పద తిరుగుతున్న ఇద్దరు వ్యక్తుల దగ్గర రెండు కిలోల 100 గ్రాముల గంజాయి పట్టుకొని కేసు నమోదు చేసినట్టు ఎస్సై వినయ్ కుమార్, ముప్కాల్ ఎస్ఐ భాస్కర్ చారి సోమవారం తెలిపారు. నిర్మల్ జిల్లాకు చెందిన ఇద్దరు వ్యక్తులు బాల్కొండ, వేల్పూర్, భీంగల్ మండలాల యువతకు నిషేధిత గంజాయి సప్లయ్ చేయడానికి వస్తున్నారని, అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని ఆపి వారి దగ్గర ఉన్న సంచిని చెక్ చేయగా అందులో నిషేధిత గంజాయి దొరికింది. సయ్యద్ అజీమ్, షేక్ అద్నాన్ సోహెల్ ఇద్దరు నిర్మల్ కి చెందిన వారు అని తెలిపారు. కొన్ని రోజులు గా బాల్కొండ, వేల్పూర్, భీంగల్ మండలాల యువత ని టార్గెట్ చేసి తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలి అనే దురుద్దేశంతో మహారాష్ట్ర నుండి గంజాయిని తక్కువ రేటుకు కొనుక్కొని వచ్చి ఇక్కడ వారికి ఎక్కువ రేటుకు అమ్ముతున్నట్టు నేరం ఒప్పుకున్నట్టు తెలిపారు. వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది విజయ్, సందీప్, శ్రావణ్, భరత్ పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

మతోన్మాద, విచ్ఛిన్నకర శక్తులను ఓడించండి

- ప్రపంచ కార్మికులారా ఏకంకండి : సీఐటీయూ పిలుపు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ప్రపంచ కార్మికులారా ఏకంకండి! మతోన్మాద, విచ్ఛిన్నకర శక్తులను ఓడించండి! అని సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ అన్నారు. సిఐటియు జిల్లా కార్యాలయంలో మేడే కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శంకర్ గౌడ్ నూర్జహాన్ మాట్లాడుతూ మేడే పోరాట స్ఫూర్తితో పెట్టుబడిదారుల, పాలక వర్గాల దోపిడీ, దాడులు, అణిచివేతలు, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాడి హక్కులు సాధించుకుంటూ, వర్గ ఐక్యతను కాపాడుతున్న శ్రామిక ప్రజలకు సిఐటియు నిజామాబాద్ జిల్లా కమిటీ అంతర్జాతీయ కార్మిక దినోత్సవం 'మేడే' శుభాకాంక్షలు తెలిపారు.

'1886 మే 1న అమెరికా చికాగో నగరంలోని హే-మార్కెట్లో 8 గంటల పని దినం కోరుతూ లక్షలాది మంది కార్మికుల ప్రదర్శనపై ఆనాటి పాలకవర్గం ఆదేశాలతో పోలీసులు ప్రదర్శనకారులపై విచక్షణా రహితంగా కాల్పులు జరిపారు. ఈ దాష్టీకాన్ని "మేడే" పోరాట వీరులు వీరోచితంగా ప్రతిఘటించారు. శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా, ఎనిమిది గంటల పని దినం కోసం కార్మిక హక్కుల రక్షణకై "మేడే" పోరాటంలో తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించారు. ఆగస్ట్ స్పైస్, ఆల్బర్ట్ పార్సన్స్, అడాల్ఫ్ ఫిషర్, జార్జ్ ఎంగెల్సు ఆనాటి పాలక వర్గం ఉరితీసింది. "మేడే" చరిత్ర మొత్తం రక్తతర్పణతో లిఖించబడింది. మేడే అంతర్జాతీయ కార్మికవర్గ ఐక్యతకు సంకేతం. శ్రామికవర్గ విజయానికి చిహ్నం. ఈ ప్రతిఘటన వల్లనే 8 గంటల పని దినం చట్టబద్ధం చేయబడింది. అదే అంతర్జాతీయ కార్మిక దినోత్సవానికి అంకురార్పణ అయ్యింది. 1890 మే 1వ తేదీన అమెరికా కార్మిక సంస్థ (ఎ.ఎఫ్.ఎల్) ప్రతి ఏటా మే 1న అంతర్జాతీయ కార్మిక దినోత్సవాన్ని జరపాలని పిలుపునిచ్చింది. 138ఏళ్ళ క్రితం కార్మికులు సాగించిన సమరశీల పోరాటల ఫలితంగానే ప్రపంచ కార్మికవర్గానికి కొన్ని హక్కులు దక్కాయి.'

నేటి కార్మికుల దుస్థితిని, పాలక వర్గాల నియంతృత్వ పోకడలను గమనిస్తే మళ్ళీ "మేడే" ఆవిర్భావం నాటి నిరంకుశ ధోరణులు పునరావృతమవుతున్నాయా? అంటే అవును అనే సమాధానం వస్తుంది. కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న హక్కులను కేంద్రంలోని బిజెపి మోడీ సర్కార్ గత 10 సంవత్సరాలుగా హరించి, తగుదునమ్మా అంటూ మూడోసారి అధికారంలోకి వచ్చేందుకు బూటకపు వాగ్దానాలతో పార్లమెంట్ ఎన్నికల్లో నానాతంటాలు పడుతున్నది. 8 గంటల పని దినాన్ని రద్దు చేసి, 12 గంటల పని దినాన్ని ప్రవేశపెట్టి యజమానులకు మేలు చేయచూస్తుంది. పని భారం, పని గంటల పెరుగుదల, స్వదేశీ, విదేశీ బడా కార్పొరేట్లకు ఆర్థిక ప్రయోజనాలు కల్పించేందుకు కార్మిక చట్టాలను సవరించింది. కొన్ని చట్టాలను రద్దు చేసింది. ఏ హక్కులు లేని స్వాతంత్రోద్యమ కాలంలోనే కార్మిక వర్గం తెల్లదొరలతో పోరాడి సాధించుకున్న సమిష్టి బేరసారల హక్కును, సమ్మె హక్కును, ప్రాతినిధ్యపు హక్కులను నాలుగు లేబర్‌కోడ్స్ పేరుతో రద్దు చేసింది. ఈ పరిస్థితులలో అంతర్జాతీయ కార్మిక దినోత్సవమైన మేడేకి మరింత ప్రాధాన్యత సంతరించుకున్నది పెట్టుబడిదారీ వ్యవస్థను కూల్చడానికి కార్మికులు ఒక్కరే రైతంగం వ్యవసాయ కార్మికుల్ని ఉపాధ్యాయ ఉద్యోగుల్ని కూడా ఉద్యమాలకు కదిలించాలి. అదే మే డే స్ఫూర్తి 2024 సంవత్సరంలో అనంతరాలు వచ్చిన 138వ మేడేను నిజామాబాద్ జిల్లాలో వాడవాడల్లో కార్ఖానాలలో పారిశ్రామిక కేంద్రాలలో ఘనంగా నిర్వహించాలని' సిఐటియు జిల్లా కమిటీ కార్మిక వర్గానికి పిలుపునిస్తున్నది. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జంగం గంగాధర్ ,నన్నేసాబ్ సిఐటియు జిల్లా నాయకులు కొండ గంగాధర్, గంగాధర్, లక్ష్మి విజయ తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగిన వ్యక్తికి మూడు రోజుల జైలు శిక్ష

నవతెలంగాణ-కామారెడ్డి

తాడ్వాయి మండలంలో వ్యక్తి మద్యం తాగి వాహనం నడిపినందుకు గాను అతనికి మూడు రోజుల జైలు శిక్ష విధించినట్టు తాడ్వాయి హెచ్ ఓ తెలిపారు. 29.03.2024 నా తాడ్వాయి పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనం నడిపినందుకు గాను పకిర్ రహీమ్ అనే వ్యక్తికి కామారెడ్డి జిల్లా రెండవ తరగతి జ్యూడిషియల్ మేజిస్ట్రేట్ ప్రతాప్, మూడు రోజుల జైలు శిక్ష వేసినట్టుతెలిపారు. జిల్లా ప్రజలందరూ ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలని తాడ్వాయి హెచ్ ఓ తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్ చేయడం చట్టరీత్యా నేరం కావున ఎవరు కూడా మద్యం తాగి వాహనాలు నడుపరాదని సూచించారు.

లెక్క తేలింది.. పోరు మిగిలింది

- ముగిసిన నామినేషన్‌ల ఉపసంహరణ ఘట్టం
- నిజామాబాద్ లోకసభ బరిలో 29 మంది
- జహీరాబాద్ పరిధిలో 19 మంది..
- మరింత హోరెత్తనున్న ప్రచారం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



లోక్‌సభ ఎన్నికల ప్రక్రియలో నామినేషన్‌ల కీలక ఘట్టం ముగిసింది. సోమవారంతో నామినేషన్‌ల ఉపసంహరణ ముగిసింది. నిజామాబాద్ లోక్‌సభ స్థానానికి సోమవారం ముగ్గురు అభ్యర్థులు తమ నామినేషన్‌లను ఉపసంహరించుకోగా మొత్తం 29 మంది బరిలో నిలిచారు. జహీరాబాద్ స్థానానికి చివరి రోజు ఏడుగురు నామినేషన్‌లు ఉపసంహరించుకోగా బరిలో 19 మంది అభ్యర్థులు నిలిచారు. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం అభ్య ర్థులకు గుర్తులను కేటాయించనున్నారు. నామి నేషన్‌ల ఉపసంరణ ముగియడంతో ఇక ప్రచారం మరింత హోరెత్తనుంది.

నిజామాబాద్ లోక్‌సభ స్థానానికి మొత్తం 42 మంది అభ్యర్థులు నామినేషన్లు వేయగా, స్క్రూటినీ సందర్భంగా 10 నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. మిగతా 32 మంది అభ్యర్థులలో ముగ్గురు తమ నామినేషన్లను ఉపసంహరించుకోగా, ఎన్నికల బరిలో 29 మంది అభ్యర్థులు మిగిలారు. సోమవారం స్వతంత్ర అభ్యర్థులు ముత్యం రఘు, పోతు నాగార్జున్, పోతు రవి తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు.

అభ్యర్థులతో ఎన్నికల అధికారి భేటి

కాగా, ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులతో సోమవారం సాయంత్రం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు భేటీ అయ్యారు. ఎన్నికల సాధారణ పరిశీలకులు ఎలిస్ వజ్ ఆర్ సమక్షంలో ఈ.సీ మార్గదర్శకాలను అనుసరిస్తూ అభ్యర్థుల పేర్లను బట్టి, అధికార తెలుగు భాష వర్ణమాల ప్రకారంగా క్రమ సంఖ్య, గుర్తులు కేటాయించారు. కట్టుదిట్టమైన ఏర్పాట్ల నడుమ కొనసాగిన నామినేషన్ల ఉపసంహరణ, గుర్తుల కేటాయింపు ప్రక్రియల్లో అదనపు కలెక్టర్ అంకిత్, ఆర్డీఓ రాజా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జహీరాబాద్ బరిలో 19 మంది

కామారెడ్డి : మే 13న జరిగే పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల బరిలో 19 మంది అభ్యర్థులు ఉన్నారని ఎన్నికల రిటర్నింగ్ అధికారి క్రాంతి వల్లూరు తెలిపారు. ఈనెల 18 నుండి 25 వరకు స్వీకరించిన నామినేషన్లలో 40 మంది అభ్యర్థులు 68 సెట్లను దాఖలు చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారులు తెలిపారు. ఇందులోనుండి 14 మంది అభ్యర్థులు 18 నామినేషన్లను తిరస్కరించినట్లు తెలిపారు. 26 మంది అభ్యర్థులు లకు గాను అందులో నుంచి ఏడుగురు పోటీలో నుండి తప్పుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం పోటీలో 19 మంది అభ్యర్థులు ఉన్నారని అన్నారు. తదితరులు పోటీలో ఉన్నట్లు ఆమె ప్రకటించారు.

నిజామాబాద్ లోక్‌సభ స్థానం బరిలో 29 మంది అభ్యర్థులు

1	అరవింద్ ధర్మపురి	(బీజేపీ)	15	కొత్తకొండ శక్తిప్రసాద్	(స్వతంత్ర)
2	బాజిరెడ్డి గోవర్ధన్	(బీఆర్ఎస్)	16	కోటగిరి శ్రీనివాస్	(స్వతంత్ర)
3	జీవన్ రెడ్డి తాటిపర్తి	(కాంగ్రెస్)	17	గంట చరితా రావు	(స్వతంత్ర)
4	పుప్పాల లింబాద్రి	(బీఎస్పీ)	18	గోపి చంద్రయ్య	(స్వతంత్ర)
5	అబ్బగోని అశోక్ గౌడ్	(బహుజన లెఫ్ట్ పార్టీ)	19	టుటుకూరు జీవన్‌రెడ్డి	(స్వతంత్ర)
6	అలీ మన్సూర్	(అన్నా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ)	20	దేశబోయిన లక్ష్మీనారాయణ	(స్వతంత్ర)
7	కందెల సుమన్	(ధర్మ సమాజ్ పార్టీ)	21	బీబీ.నాయక్	(స్వతంత్ర)
8	గుయ్య సాయి కృష్ణమూర్తి	(యుగ తులసి పార్టీ)	22	పాలమూరు సాయినిఖిల్	(స్వతంత్ర)
9	గోలి నరేష్	(దళిత బహుజన పార్టీ)	23	ప్రశాంత్ కత్రాజి	(స్వతంత్ర)
10	దేవతి శ్రీనివాస్	(బహుజన ముక్తి పార్టీ)	24	మాలావత్ విఠల్	(స్వతంత్ర)
11	భూక్యా నందు	(విద్యార్థులు రాజకీయ పార్టీ)	25	రాగి అనిల్	(స్వతంత్ర)
12	మొగిలి రాజ్ కుమార్	(ఇండియా ప్రజా బంధు పార్టీ)	26	రాపల్లి సత్యనారాయణ	(స్వతంత్ర)
13	యోగేందర్ గట్ల	(అలయన్స్ ఆఫ్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ పార్టీ)	27	రాపెల్లి శ్రీనివాస్	(స్వతంత్ర)
			28	వేముల విక్రమ్ రెడ్డి	(స్వతంత్ర)
14	ఆరె రాజేందర్	(స్వతంత్ర)	29	సయ్యద్ అస్గర్	(స్వతంత్ర)

జహీరాబాద్ స్థానం నుంచి 19 మంది అభ్యర్థులు

1	గాలి అనిల్ కుమార్	బీఆర్ఎస్
2	బీబీ పాటిల్	బీజేపీ
3	సురేశ్ షెట్కార్	కాంగ్రెస్
4	కొత్త బలిజ బసవరాజ్	తెలంగాణ ప్రజాశాంతి
5	గుర్రపు మచ్చేందర్	ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్
6	చావగాని మని	అలయన్స్ ఆఫ్ డెమొక్రటిక్
7	టీడీఎస్ మనీ	ధర్మ సమాజ్ పార్టీ
8	మల్లెపు మోహన్‌రెడ్డి	పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా
9	రోమాల బాబు దుర్గయ్య	ఇండియా ప్రజాబంధు పార్టీ
10	అశోక్ తలారి	స్వతంత్ర
11	కమ్మరి ఆనంద్	స్వతంత్ర
12	ఈశ్వర్ జైపాల్‌నాయక్	స్వతంత్ర
13	మహమ్మద్ సద్దాం	స్వతంత్ర
	మహాదేవ్ స్వామి	స్వతంత్ర
14	మహా మత్తం	స్వతంత్ర
15	బి మారుతి రావు	స్వతంత్ర
16	ఎండి. యాకూబ్‌షరీఫ్	స్వతంత్ర
17	రమేష్ సజ్జాపూర్	స్వతంత్ర
18	ఎస్ రాజు కోపూరి	స్వతంత్ర
19	సత్యనారాయణ గౌడ్	స్వతంత్ర

అహంకారి అరవింద్‌ను ఓడించాలి

మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

ఏం చేయకపోయినా ప్రజలు మోడీ పేరుతో తనను గెలిపిస్తారని కలలు కంటున్న అహంకారి అర్వింద్ ను నిజామాబాద్ పార్లమెంట్ ప్రజలు ఓడించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. అప్పుడే ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే తిరస్కరిస్తారని భయం పుడుతుందన్నారు. సోమవారం సాయంత్రం ఆయన బిఆర్ఎస్ పార్టీ నిజామాబాద్ పార్లమెంట్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ తరపున మండలంలోని ఉప్లూర్, మండల కేంద్రంలో ర్యాలీ, సీట్ కార్నర్ మీటింగ్లో పాల్గొని ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సాధ్యం కాని, అలవి కానీ ఎన్నో హామీలు ఇచ్చి ప్రజల ను మోసం చేసిండన్నారు. బిఆర్ఎస్ పార్టీ ఇచ్చిన హామీలకు, ఇస్తున్న పథకాలకు రెండింతలు ఇస్తానని చెప్పి మోసం చేసిండు అన్నారు. ఒక్కసారి కాంగ్రెస్‌కు అవకాశం ఇచ్చి చూద్దాం అని ప్రజలు అనుకుంటే ఆ నమ్మకాన్ని కాంగ్రెస్ పార్టీ నిలుపుకోలేదని విమర్శించారు. ఎమ్మెల్సీగా జీవన్ రెడ్డి, ఎంపీగా అర్వింద్ ఈ ప్రాంత ప్రజల కష్టా సుఖాలు ఏనాడు పంచుకోలేదన్నారు. కాంగ్రెస్ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థికి ఇక్కడి ప్రజల కష్టాలు తెలియవన్నారు. బిఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి బాజరెడ్డి రెడ్డి గోవర్ధన్‌కు ఇక్కడి ప్రజల కష్టసుఖాలు తెలుసన్నారు. అనుభవం ఉన్న నాయకుడు, ప్రజల మధ్య ఉండే నేత ఒక్కసారి ఆలోచించి ఓటు వేయాలని కోరారు.

సెలవుల్లో టీయూలో హాస్టల్ వసతి కల్పించాలి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ ఎస్ ఎస్ యుఐ ఆధ్వర్యంలో యూనివర్సిటీ చీఫ్ వార్డెన్ కు వేసవి సెలవుల్లో హాస్టల్ వసతి కల్పించాలని డిమాండ్ చేస్తూ వినతిపత్రాన్ని సోమవారం అందజేశారు. యూనివర్సిటీ అధ్యక్షులు కోమురశ్రీశైలం మాట్లాడుతూ యూనివర్సిటీలోని విద్యార్థులు పోటీ పరీక్షలకు సిద్ధం అవుతున్నారని, గ్రూప్ 01, గ్రూప్ 02 పరీక్షా తేదీలను సిఎస్ పి ఎస్ సి ప్రకటించినట్టు తెలిపారు. దానివల్ల విద్యార్థులు వేసవి సెలవులో యూనివర్సిటీలో ఉంటూ పరీక్షలకు సిద్ధం అయ్యేవారికి హాస్టల్ వసతి కల్పించి వారికి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనివర్సిటీ కమిటీ నాయకులు సాగర్ నాయక్, రాజేందర్, మహేష్, నవీన్, అనిల్ శ్రీను రాథోడ్ పాల్గొన్నారు.

పాఠశాలలో చోరీ

నవతెలంగాణ-ముప్కాల్

ముప్కాల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గుర్తుతెలియని దుండగులు పలు పరికరాలతో పాటు విలువైన వస్తువులను దొంగతనం చేయడంపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంగారాం సోమవారం తెలిపారు. సెలవుల నేపథ్యంలో ఈ నెల 24వ తేదీన పాఠశాల ముగించుకొని వెళ్లగా తిరిగి మంగళవారం రోజు పని నిమిత్తం పాఠశాలకు వెళ్లగా 4 గదులు తెరిచి ఉన్నట్టు తెలిపారు. పరికరాలు, ఇతర వస్తువులు చిందరవందరగా పడి ఉండడంతో పోలీసులకు సమాచారం అందించమన్నారు. దాదాపు రూ.30 వేల రూపాయల మేర ఆస్తినష్టం వాటిల్లిందని అన్నారు. 50 మెగావాట్ల బాక్స్, స్పీకర్లు, ఇంప్లిఫైర్లు, 2 పరీక్ష పేపర్ల భద్రత బాక్సులు చోరీకి గురైనట్లు పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్‌ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఎంసెట్ మోడల్ టెస్ట్ సక్సెస్

- సృజనాత్మకతను వెలికి తీసేలా ఎస్ఎఫ్ఐ ప్రతిభా పరీక్షలు
- అభినందనీయమని పలువురి కితాబు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



ప్రశ్నపత్రం విడుదల చేస్తున్న కళాశాల చైర్మన్, ఎస్ఎఫ్ఐ నాయకులు

భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) నిజామాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నగర కేంద్రంలో గల నిషిత డిగ్రీ కళాశాలలో సోమవారం నిర్వహించిన మోడల్ ఎంసెట్ పరీక్ష విజయవంతం అయినట్టు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమం సందర్భంగా మోడల్ ఎంసెట్ ప్రశ్నాపత్రాలను నిషిత డిగ్రీ కళాశాలల చైర్మన్ రాజు డాక్టర్ సూరి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులందరూ భయాన్ని వదిలి, ప్రశాంతత వాతావరణంలో పరీక్షలు రాసి ఉత్తమ మార్కులు సాధించాలని అన్నారు. అలాగే విద్యార్థుల్ని ఎప్పటికప్పుడు చైతన్య పరుస్తూ, వారిలోనే సృజనాత్మకతను వెలికి తీసే రకంగా ప్రతిభా పరీక్షలు నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘానికి అభినందనలు తెలిపారు.

ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పోషమైన మహేష్, రాచకొండ విగ్నేష్ మాట్లాడుతూ భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ గత 19 సంవత్సరాల నుండి ఇంటర్మీడియట్ పూర్తి అయిన విద్యార్థులకు మోడల్ ఎంసెట్ పరీక్షను నిర్వహిస్తూ వారిలో ఉన్న భయాన్ని పోగొట్టి, సృజనాత్మకతను వెలికి తీస్తున్నామని అన్నారు. అలాగే ఈ మోడల్ ఎంసెట్ ఐఐటి చుక్కా రామయ్య ఆధ్వర్యంలో రూపొందిస్తు న్నట్టు తెలిపారు. ఈ సంవత్సరం నిర్వహించిన మోడల్ ఎంసెట్ పరీక్షలో 200 మంది విద్యార్థులకు పాల్గొన్నారని తెలియజేశారు. అదేవిధంగా ఎస్ఎఫ్ఐ విద్యారంగ సమస్యల పరిష్కారం కొరకు పోరాటాలు నిర్వహిస్తూ, విద్యార్థుల్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేయడం కోసం ఇలాంటి అనేక కార్యక్రమాలు చేపడుతుందని ఈ సందర్భంగా తెలియజేశారు. అలాగే విద్యార్థులందరూ రానున్న పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి, ఉన్నత స్థానాలకు ఎదిగేరకంగా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి దీపిక, నగర అధ్యక్షులు గణేష్, నగర సహాయ కార్యదర్శి ఆజాద్, నగర కమిటీ సభ్యులు సంతోష్, అజయ్ నగర నాయకులు సూర్య పాల్, లక్ష్మీపతి, వినోద్, ఇంద్రజిత్ శివ మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

ఇసుకపై నాలేశ్వర్ వీడీసీ పెత్తనం

- రెవెన్యూ అనుమతి ఉన్నా ఇసుక ట్రాక్టర్‌లు ఆపి డ్రైవర్‌లపై దాడి
- వీడీసీకి కాసులు కురిపిస్తున్న ఇసుక
- ప్రేక్షక పాత్రలో అధికార యంత్రాంగం

నవతెలంగాణ-నవీపేట్



గ్రామ శివారులోని ఇసుకపై గ్రామాభివృద్ధిదే పెత్తనం అంటూ రెవెన్యూ అధికారులపై దౌర్జన్యం చేసిన సంఘటన నవీపేట్ మండలంలోని నాలేశ్వర్ గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. గృహ నిర్మాణం కోసం మండలంలోని బినోల గ్రామస్తులు రెవెన్యూ అధికారుల నుండి అనుమతులు తీసుకొని సోమవారం నాలేశ్వర్ వాగు నుండి ఇసుకను తరలిస్తుండగా నాలేశ్వర్ గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు డ్రాక్టర్ డ్రైవర్ల పై దాడి చేసి మూడు ట్రాక్టర్లను గ్రామాభివృద్ధి భవనంలో సోమవారం బంధించిన సంఘటన చోటుచేసుకుంది. బినోల గ్రామస్తులు పది ట్రాక్టర్ల ఇసుక కోసం మూడు ట్రాక్టర్లతో చాలాన్లను రెవెన్యూ అధికారులకు చెల్లించి నిజాంపూర్, నాలేశ్వర్ వాగుల నుండి ఇసుకను తరలించేందుకు అనుమతులు పొందారు. సోమవారం అనుమతుల మేరకు నాలేశ్వర్ వాగు నుండి మూడు డాక్టర్లలో ఇసుకను తరలిస్తుండగా గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు అడ్డుకొని రెవెన్యూ అధికారులతో వాగ్వాదానికి దిగారు. మా గ్రామం నుండి ఇసుకను తరలించేందుకు ఒప్పుకోబోమని పెత్తనమంతా మాదేనని ఎవరు వచ్చిన వినేది లేదని కరాకండిగా చెప్పి ట్రాక్టర్ డ్రైవర్లపై దాడి చేసి మూడు ఇసుక ట్రాక్టర్లను వి డి సి కమిటీ హాలులో బంధించినట్లు బాధితులు తెలిపారు. ఇసుకపై రెవెన్యూ, మైనింగ్ సంబంధిత అధికారుల అనుమతులు పొందిన తమను దౌర్జన్యంగా బంధించడం పట్ల బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇసుకపై నాలేశ్వర్ వీడిసి పెత్తనం చెలాయించడం పట్ల జిల్లా అధికార యంత్రాంగం స్పందించి వీడిసిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

డీఆర్‌డీవో, డీపీఎం పర్యటన

నవతెలంగాణ-మెండోరా

అదనపు డీఆర్‌డీవో రవీందర్, డిపిఎం సాయిలు మెండోర మండలాన్ని సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా మండలంలో ఉన్న ఏపిపిసి చైర్ పర్సన్ లతో, పాఠశాలల్లో జరుగుతున్న పనులను సమీక్షించారు. పలు సూచనలు ఇచ్చారు.

మున్సిపల్ కార్మికులు సీఐటీయూలో చేరిక



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ మున్సిపల్ కార్మికులు ఆశాబాయి, సావిత్రి సోమవారం బీఎల్టీయూ నుంచి సీఐటీయూలో చేరారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్ కండువా కప్పి సిఐటీయులోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీఐటీయూ కార్మికుల హక్కుల కోసం నిరంతరం రాజీలేని పోరాటాలు చేస్తుందన్నారు. మున్సిపల్ కార్పొరేషన్‌లో మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం పోరాటాలు చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఈవీఎల్ నారాయణ, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నన్నేసాబ్, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవోకు ఘనంగా వీడ్కోలు

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

నిజామాబాద్ మండల ఎంపిడిఓ మల్లేష్ ఉద్యోగ విరమణ చేసిన సందర్భంగా ఆయన్ను ఘనంగా సన్మానించారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో వీడ్కోలు సమావేశంలో ఏర్పాటుచేశారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. ఎన్నో ఒడిదొడుకులు ఎదుర్కొంటూ ఉద్యోగంలో మంచి స్థానం పొంది సేవలను అందించారన్నారు. ఈసందర్భంగా ఆయనకు పంచాయతీ సెక్రటరీలు, ఎంపిఓ మధురిమ, ఎంపిపి అనుష ప్రేమ నాయక్, వైస్ ఎంపిపి అన్నం సాయిలు, నిజామాబాద్ మండల ఎస్‌టిసెల్ అధ్యక్షుడు గోపాల్ నాయక్, తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలి

- ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు దాస్

నవతెలంగాణ-ఆర్మూర్

నరేంద్ర మోడీ మతోన్మాద ఫాసిస్టు, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు దాసు, రాష్ట్ర సహాయ కార్యదర్శి సూర్య శివాజీ కార్మికులకు పిలుపునిచ్చారు. మేడే పోస్టర్లను పట్టణంలో శ్రామికనగర్ ఐఎఫ్టియు ఆఫీసు వద్ద సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికల్లో నరేంద్ర మోడీ బిజెపి పార్టీ ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయకుండా, కార్మిక వర్గం ప్రశ్నిస్తారని భయంతో కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను తెచ్చారని అన్నారు. అన్నదాత రైతన్న ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని అబద్ధపు వాగ్దానం ఇచ్చి రైతుల చేతిలో ఉన్న భూమిని కార్పోరేట్ పెట్టుబడిదారులు అంబానీ ఆదానిలకు కట్టబెట్టే కుట్ర మోడీ, అమిత్షాలు చేస్తున్నారని తెలిపారు. దేశ సంపదను పెట్టుబడిదారులకు అప్పజెప్తూ, కార్మికుల ఉపాధిని దెబ్బతీస్తూ, రైతు కార్మిక ప్రజావ్యతిరేక విధానాలను మోడీ ప్రభుత్వం అనుసరిస్తుందన్నారు. ఉద్యోగ ఉపాధి భద్రతకై ఉద్యమిస్తూనే, మతోన్మాద ఫాసిస్టు విధానాలను నిరసిస్తూ ఉద్యమించాలని దాసు, శివాజీ కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఐఎఫ్టియు నాయకులు మగ్దుంపటేల్, శివకుమార్, కాజా పటేల్, అరుణోదయ జిల్లా అధ్యక్షులు సూరిబాబు, సోయల్, లతీఫ్, రాజు, ప్రిన్స్, అలీం భాయ్, కరీం, రవి, తదితరులు పాల్గొన్నారు.

సీబీఎస్సి శిక్షణ తరగతులు



శిక్షణ తరగతులో పాల్గొన్న ఉపాధ్యాయులు

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని చేపూర్‌లోని క్షత్రియ ఉపాధ్యాయులకు సిబిఎస్సి శిక్షణ తరగతులు సోమవారం నిర్వహించారు. ఈ శిక్షణా తరగతుల కార్యక్రమాన్ని క్షత్రియ విద్యా సంస్థల కార్యదర్శి అల్జాపూర్ దేవేందర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. డిప్యూటీ డిస్ట్రిక్ట్ ట్రెనింగ్ కో ఆర్డినేటర్, స్కూల్ ప్రిన్సిపాల్ పి.లక్ష్మీనరసింహస్వామి, రిసోర్స్ పర్సన్స్ డాక్టర్ సంజీవ్ నాంపల్లి, పవన్‌కుమార్, రాజుపాలెంగాకు పాల్గొన్నారు. ఇటీవల డిప్యూటి డిస్ట్రిక్ట్ ట్రెనింగ్ కొ ఆర్డినేటర్‌గా సీబీఎస్‌ఈ ద్వారా నియమింపబడిన క్షత్రియ పాఠశాల ప్రిన్సిపల్ పి.లక్ష్మి నరసింహస్వామికి క్షత్రియ విద్యా సంస్థల చైర్మన్ యాజమాన్య బృందం అభినందనలను తెలియజేసింది. ఈ సందర్భంగా క్షత్రియ విద్యా సంస్థల కార్యదర్శి అల్జాపూర్ దేవేందర్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు విధి నిర్వహణను విజయ వంతం చేసుకోవడానికి ఇటువంటి శిక్షణా తరగతులు ఎంతగానో ఉపమోగపడ్తాయని అన్నారు. డిప్యూటీ డిస్ట్రిక్ట్ ట్రెనింగ్ కోఆర్డినేటర్ స్కూల్ ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. మారుతున్న సీబీఎస్సి విధి విధానాలను ఎప్పటికప్పుడు ఉపాధ్యాయులకు తెలియజేయాలనే లక్ష్యంతో ఈ శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు నిరంతర విద్యార్థి అని, తెలుసుకోవాల్సిన జ్ఞానం ఎంతో ఉన్నదని, అందుకే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ శిక్షణ తరగతుల్లో క్షత్రియ స్కూల్ చేపూర్, సెయింట్ అనన్స్ ఆర్మూర్, కార్మెల్ - మంచిర్యాల పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కార్యక్రమంలో స్కూల్ కౌన్సిలర్ మాదం మహిపాల్, టీచర్స్‌కాలనీ ప్రిన్సిపాల్ అరుంధతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ నసీంకు ఘనంగా వీడ్కోలు



ప్రొఫెసర్ నసీం దంపతులను సన్మానిస్తున్న తెలంగాణ టీయూ టీచర్స్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీలో అకడమిక్, పాలనా పరమైన పదవులలో ప్రొఫెసర్ డాక్టర్ నసీం తనదైన ముద్ర వేశారని తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.యాదగిరి అన్నారు. ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ నసీం పదవీ విరమణ సందర్భంగా అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ యూనివర్సిటీ టీచర్స్ (అటుట్) ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశానికి ప్రొఫెసర్ యాదగిరి హాజరై మాట్లాడారు. యూనివర్సిటీలో హెడ్ ఆఫ్ ధ డిపార్ట్మెంట్ చైర్ పర్సన్ హెడ్ లాంటి పలు అకడమిక్ పదవులను సమర్థవంతంగా నిర్వహించారన్నారు. నసీమ్ యూనివర్సిటీ తొలి మహిళా అడ్మినిస్ట్రేటర్‌గా అన్ని పదవులు నిర్వహించిన ఆమె పాలనలో తనదైన ముద్ర వేశారని తెలిపారు. అటుట్ అధ్యక్షుడు ప్రొఫెసర్ డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రొఫెసర్ నసీం ఏనాడు పదవుల కోసం పాకులాడ లేదని, పదవులు ఆమెను వెతుక్కుంటూ వచ్చాయని అన్నారు. ఒకానొక సందర్భంలో మూడోసారి రిజిస్ట్రార్ పదవికి అవకాశం వచ్చినా తిరస్కరించారని పేర్కొన్నారు. యూనివర్సిటీ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఆరతి మాట్లాడుతూ ప్రొఫెసర్ నసీం అజాతశత్రువని కొనియాడారు. ఆమె సహ ఉద్యోగులతో ఎంతో ఆత్మీయతతో ఉన్నారని అన్నారు. అటుట్ సభ్యులు ప్రొఫెసర్లు రవీందర్ రెడ్డి, రాంబాబు, త్రివేని, లావణ్య లు ప్రొఫెసర్ నసీం సేవలను కొనియాడారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో అటుట్ సభ్యులు ఘనంగా సన్మానించారు.

అబాకస్‌లో ఇంటర్నేషనల్ స్థాయికి ఎంపికైన శ్రీ భాషిత విద్యార్థి



బహుమతి అందుకుంటున్న విద్యార్థిని

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని శ్రీ భాషిత పాఠశాలలో మూడో తరగతి చదువుతున్న బి.భూమేష్ చంద్ర సోమవారం హైదరాబాదులో జరిగిన నేషనల్ లెవెల్ అబాకస్ స్టేట్ జూనియర్ లెవెల్ 2 పోటీలలో రెండవ బహుమతి సాధించి, ఇంటర్నేషనల్ లెవెల్‌కి ఎంపికయ్యారు. ఐదవ తరగతికి చెందిన బి.మనస్విని లోకన్సోలేషన్ బహుమతి పొందారు. ఇందులో భాగంగా శ్రీ భాషిత పాఠశాల కరస్పాండెంట్ పోలపల్లి సుందర్ మాట్లాడుతూ అబాకస్ అనేది స్పీడ్ మ్యాథ్స్ మా పాఠశాలలో అబాకస్ ను ఒకటవ తరగతి నుండి విద్యార్థులకు నేర్పిస్తామన్నారు. అబాకస్ అనేది పిల్లల మేధాసంపత్తి కి దోహదపడుతుంది అని చెప్పారు. నేషనల్ లెవెల్ లో సెలెక్ట్ అయిన భూమేష్ చంద్రకి శ్రీ భాషిత పాఠశాల యాజమాన్యం అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఓటుతోనే చైతన్యవంతమైన ప్రజాస్వామ్యం

- ఎన్నికల సాధారణ పరిశీలకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ప్రతి ఓటరు నిజాయితీతో ఓటు వేయడం ద్వారా చైతన్యవంతమైన ప్రజాస్వామ్యానికి ఊతం ఇవ్వాలని ఎన్నికల సాధారణ పరిశీలకులు ఎలిస్‌వజ్‌ఆర్ ఐఏఎస్ పిలుపునిచ్చారు. రాబోయే లోక్‌సభ ఎన్నికలలో ఓటింగ్ శాతం పెంపు దిశగా ఓటర్లకు అవగాహన కల్పించేందుకు కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సీబీసీ) ఆధ్వర్యంలో నిజామాబాద్ టిఎస్‌ఆర్టిసి బస్ స్టేషన్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన 3 రోజుల ఛాయాచిత్ర ప్రదర్శన (ఫోటో ఎగ్జిబిషన్)ను ఎన్నికల సాధారణ పరిశీలకులు ఎలిస్‌వజ్ ఆర్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎస్.కిరణ్‌కుమార్ రిబ్బన్ కట్‌చేసి సోమవారం ప్రారంభించారు. అనంతరం ఎన్నికల సాధారణ పరిశీలకులు మాట్లాడుతూ..సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఆధ్వర్యంలో ఓటర్ చైతన్యం ఛాయాచిత్ర ప్రదర్శన ఏర్పాటు చేయడం అభినందించదగ్గ విషయమన్నారు. సమాజంలోని విద్యావంతులు, ప్రజలు ఓటు విలువ తెలుసుకొని ప్రజాస్వామ్య పద్ధతిలో నిజాయితీగా ఓటు వేయాలని సూచించారు. యువత ఓటు వినియోగించడంలో నిజాయితీని ప్రదర్శించాలని తెలిపారు. అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు చాలా విలువైనదని, దాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ ఛాయచిత్ర ప్రదర్శన మే 1 వరకు కొనసాగుతుందని తెలిపారు. ఈ ప్రదర్శనలో 1951 నుంచి ప్రారంభమైన భారత ఎన్నికల చరిత్ర, మొబైల్ యాప్‌లు, ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల వరకు అన్ని అంశాలను ప్రదర్శనలో వివరించారు. కార్యక్రమంలో సీబీసీ ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ బి.ధర్మానాయక్, టిఎస్‌ఆర్టిసి ఆర్ఎం కే.జానీరెడ్డి, స్వీప్ జిల్లా నోడల్ ఆఫీసర్ సురేష్‌కుమార్, డిడబ్ల్యూ ఎస్ కె.రసూల్ బి, నెహ్రూ యువ కేంద్రం జిల్లా యూత్ ఆఫీసర్ శైలి బెల్లాల్, డిప్యూటీ ఆర్ఎం శంకర్ నాయక్, డిపో మేనేజర్ 2 సాయన్న, ఆకాశవాణి ప్రసార నిర్వహణ అధికారి మోహన్‌దాస్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



రిబ్బన్ కట్‌చేసి ప్రారంభిస్తున్న ఎన్నికల సాధారణ పరిశీలకులు ఎలిస్‌వజ్‌ఆర్

ఎంపీగా గెలిపించండి

- కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి తాటిపత్రి జీవన్‌రెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్

రాజకీయాలకు అతీతంగా అండగా నిలిచి ఎంపిగా గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి తాటిపత్రి జీవన్‌రెడ్డి అన్నారు. మండలంలోని అంకాపూర్ గ్రామంలో సోమవారం రైతుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ బీజేపీకి జీవన్‌రెడ్డికి, అరవింద్‌కు వ్యత్యాసం గమనించాలని రైతులతో ముచ్చటించి సమస్యలు తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా ప్లాట్‌ఫామ్‌లు ఏర్పాటు చేయాలని, డబుల్ బెడ్‌రూం ఇళ్లను పంపిణీ చేయాలని రైతులు కోరారు. ప్లాట్‌ఫామ్‌లు ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి హామీ ఇచ్చారు. రైతుల సమస్యలు తెలిసిన రైతు బిడ్డ జీవన్‌రెడ్డికి ఓటు వేసి, ఎంపీగా గెలిపించుకుంటామని ముక్త కంఠంతో నినదించారు. ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో వ్యవసాయంలో అంకాపూర్‌కు ప్రత్యేకత ఉందని, రైతులు అందరూ రాజకీయాలకు అతీతంగా మద్దతు తెలుపాలని కోరారు. రాజకీయ పార్టీల ఆలోచన విధానం, పార్టీ అభ్యర్థిని పరిగణలోకి తీసుకొని ఓటు వేయాలని కోరారు. ఉద్యమ నాయకుడిగా కేసీఆర్‌కు రెండు సార్లు అధికారం అప్పగిస్తే ఆకాంక్షలు నెరవేర్చ లేదు. ప్రజలు మార్పు కోరి రాష్ట్రంలో కాంగ్రెస్‌కు పట్టం కట్టారని, ఎస్ఆర్ఎస్‌పితో ఉత్తర తెలంగాణ సస్యశ్యామలం అయిందని, విద్యుత్‌పై ఆధారపడి సాగు చేసే రైతులకు విద్యుత్ భారం కాకుడదని 2004లో ఉచిత విద్యుత్ ప్రారంభించామని తెలిపారు. గల్ఫ్ కార్మికుల బోర్డ్ ఏర్పాటు చేస్తామని, బాధిత కుటుంబాలకు ఐదు లక్షల ఆర్థిక సాయం అందిస్తామని అన్నారు. మోడీ 2014లో రైతుల ఆదాయం రెట్టింపు చేస్తాం అని చెప్పి పెట్టుబడి రెట్టింపు చేశారని, రాయితీ ఇస్తున్నామని చెప్తున్నారు కానీ పెరిగిన ధరలు చెప్పడం లేదని, యూరియా 50కిలోల సంచి 45కిలోలకు తగ్గించి మోసం చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి, రాష్ట్ర మార్క్ ఫైడ్ చైర్మన్ మారా గంగారెడ్డి, డిసిసి అధ్యక్షులు మానాల మోహన్‌రెడ్డి, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహిర్ బీన్, నియోజకవర్గ ఇన్చార్జ్ పొద్దుటూరి వినయ్‌రెడ్డి, మార చంద్రమోహన్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి

లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ రీజియన్ చైర్మన్‌గా రాజేష్



నవతెలంగాణ-ఆర్మూర్

లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ లయన్స్ క్లబ్ గ్రీన్ ఆధ్వర్యంలో లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320డి రీజియన్ చైర్మన్ డికే.రాజేష్ ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం ఘనంగా సన్మానించారు. జోన్ చైర్మన్‌గా నియమింపబడిన చేపూర్ గణేష్ సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా రీజియన్ చైర్మన్ మాట్లాడుతూ.. ఎలెక్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ (2024-2025) పాంపట్టి నాగేష్ తనపై నమ్మకంతో ఇచ్చిన బాధ్యతను రీజియన్ నందు గల జోన్ చైర్మన్‌ల రీజియన్ నందు గల క్లబ్‌ల సహాయంతో డిస్ట్రిక్ట్ నందు ఉత్తమ రీజియన్‌గా ఉండే విధంగా సహాయ కార్యక్రమాలు నిర్వహిస్తానని అన్నారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ఆఫ్ గ్రీన్ అధ్యక్షులు గుజరాతీ గంగాప్రకాష్, కార్యదర్శి అల్జాపూర్ రాజేష్, సభ్యులు గుజరాతీ నివేదన్, ఆకుల రాజు, పోల్కం వేణు, దాచేపల్లి సంతోష్, దొండి సాయి కృష్ణ, నసీరుద్దీన్, పాంపట్టి అశోక్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలోనే

అన్ని రంగాల్లో అవకాశాలు

- టిపిసిసి అధికార ప్రతినిధి బాస వేణుగోపాల్ యాదవ్
- ఉపాధి పని ప్రదేశంలో ఎన్నికల ప్రచారం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

పేదలకు, బడుగు బలహీన వర్గాలకు అన్ని రంగాల్లో అవకాశాలు కల్పించిన ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమేనని టిపిసిసి అధికార ప్రతినిధి బాస వేణుగోపాల్ యాదవ్ అన్నారు. సోమవారం ఆయన మండలంలోని కోసముందర్, నర్సాపూర్, ఇనాయత్ నగర్, అమీర్ నగర్ గ్రామాల్లో ఉపాధి పని ప్రదేశంలో కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డిని గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ కూలీలతో ఆయన మాట్లాడుతూ రాజకీయంగా అనుభవం ఉన్న నాయకుడు, మాజీ మంత్రి జీవన్ రెడ్డిని గెలిపించాలన్నారు. రాష్ట్రంలో అధికారం ఇచ్చారు, దేశంలో కాంగ్రెస్ ప్రభుత్వం వస్తేనే పేదలకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు.

ఉపాధి హామీ పథకం ప్రవేశపెట్టింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని గుర్తు చేశారు. పది సంవత్సరాలలో ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసిన చేసిన ఘనత నరేంద్ర మోడీ, కేసీఆర్‌లదే అని విమర్శించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాలుగు నెలల్లో మాట తప్పకుండా ఐదు గ్యారంటీలు అమలు చేస్తున్నామన్నారు. ఆగస్టు 15 లోపు రెండు లక్షల రుణమాఫీ కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుందని స్పష్టం చేశారు. గడిచిన మూడు నెలల పాలనలో 30 వేల ఉద్యోగాలను భర్తీ చేయడం జరిగిందన్నారు. బిజెపి అధికారంలోకి వస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లను రద్దుచేసే ప్రమాదం ఉందన్నారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని కేవలం 25 లక్షల ఉద్యోగాలు ఇచ్చి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. దేశంలో నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడుకున్న చరిత్ర బిజెపి ప్రభుత్వం, నరేంద్ర మోడీదేనని దుయ్యబట్టారు. బీసీల ద్రోహుల పార్టీ బిజెపినే అన్నారు. అందుకే బీసీల కులగణనను అడ్డుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు పడిగల ప్రవీణ్, కోన సమందర్ గ్రామ కమిటీ అధ్యక్షుడు జైదీ శ్రీనివాస్, బోర్రన్న, రాము, గంగాధర్ యాదవ్, మకిలీ అనిల్, రాములు నాయక్, రమేష్ గౌడ్, సంజీవ్ యాదవ్, మానాల రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.



ఉపాధి పనుల ప్రదేశంలో ప్రచారం చేస్తున్న టిపిసిసి అధికారి ప్రతినిధి వేణుగోపాల్ యాదవ్

రోడ్డు ప్రమాద బాధితులకు సురేష్‌రెడ్డి పరామర్శ



బాధితులను పరామర్శిస్తున్న సురేష్‌రెడ్డి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రానికి చెందిన రెంజర్ల శ్యాంసుందర్, రెంజర్ల నర్సారెడ్డి కుటుంబ సభ్యులను రాజ్యసభ సభ్యులు కేఆర్ సురేష్ రెడ్డి సోమవారం పరామర్శించారు. ఐదు రోజుల క్రితం వర్ని మండలం బడా పహాడ్ శుభకార్యం నిమిత్తం డీసీఎం వ్యాన్‌లో వెళుండగా నిజామాబాద్ రూరల్ మండలం మల్లారం అటవీ ప్రాంతంలో కొత్తపేట శివారులో డీసీఎం వ్యాన్ బోల్తా పడిన ఘటనలో మృతి చెందిన బాధిత కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. ఈ ప్రమాదంలో రెంజర్ల శ్యాంసుందర్ అక్కడికక్కడే మృతి చెందగా, రెంజర్ల నర్సారెడ్డి సతీమణి రెంజర్ల వసంత తీవ్ర గాయాలతో జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందారు. ఈ ప్రమాదంలో మరో 15 మందికి తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న సురేష్ రెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. రెంజర్ల శ్యాంసుందర్, రెంజర్ల వసంతల మృతి పట్ల బాధిత కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గడ్డం స్వామి, బద్దం రాజేశ్వర్, అహ్మద్ హుస్సేన్, చింత గణేష్, హల్దే శ్రీనివాస్, సంత రాజేశ్వర్, కుంట ప్రతాపరెడ్డి, లింగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మండల కేంద్రానికి చెందిన రెంజర్ల వసంత, రెంజర్ల శ్యాంసుందర్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, బాల్కొండ బిజెపి ఇంచార్జ్ డాక్టర్ ఏలేటి మల్లికార్జున్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకుని తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆయన వెంట బిజెపి నాయకులు రేంజర్ల గంగారం, చింత ప్రవీణ్, శ్రీ కుమార్, మల్లేష్ యాదవ్, తదితరులు ఉన్నారు.

వందశాతం పోలింగ్ లక్ష్యం

- వారం పాటు ముగ్గుల పోటీలు, అవగాహన కార్యక్రమాలు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

ప్రతి ఒక్క ఓటరు తమ ఓటు హక్కు వినియోగించుకునేలా ఇటు మహిళా సంఘాల సభ్యులు, అదేవిధంగా అన్ని శాఖల సిబ్బంది కృషి చేయాలని తహసిల్దార్ ఆంజనేయులు ఆధ్వర్యంలో ఈనెల 22 నుంచి 29 వరకు విస్తృతంగా ఓటరు అవగాహన కార్యక్రమాలు మండల వ్యాప్తంగా నిర్వహించారు. మండలంలో 911 మహిళా సంఘాలు ఉండగా 9400 మంది సభ్యులు ఉన్నారు. ప్రతి ఒక్క సభ్యురాలు తమ బంధువులు అందరితో సహా ఓటు హక్కు వినియోగించుకునేలా మహిళా సంఘాల నాయకులు ఐకెపి సిబ్బంది కృషి చేయాలని తహసిల్దార్ ఆంజనేయులు, ఏపిఎం కుంట గంగాధర్ ముగ్గుల పోటీలు, గ్రామసభలు, మహిళా సంఘాల సమావేశాలు వంటి కార్యక్రమాలు విరివిగా చేపట్టారు. ఎన్నికల కమిషన్ వారి ఆదేశాల మేరకు స్వీప్ లో భాగంగా అన్ని గ్రామాల్లో మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో సమావేశాలు నిర్వహించారు. మండలంలోని 29 గ్రామ మహిళా సమాఖ్యలలో, మండల సమాఖ్యలు ప్రత్యేక ఎజెండాగా పెట్టి సమావేశాలు నిర్వహించడంతోపాటు తీర్మానాలను సైతం చేసి కలెక్టర్ కార్యాలయానికి పంపించారు. ఎంపీడీఓ కార్యాలయంలో అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందికి కూడా ప్రత్యేకంగా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. మరోపక్క బూత్ లెవెల్ అధికారులతో కలిసి అన్ని గ్రామాల్లో ఓటర్ స్లిప్పుల పంపిణీ కార్యక్రమం కూడా ప్రారంభించారు. మండల సంబంధిత సిబ్బంది వివో ప్రతినిధులు, సీసీలు, పంచాయతీ కార్యదర్శులు, కారొబార్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, రెవెన్యూ, పంచాయతీ రాజ్ సిబ్బంది, వ్యవసాయ సిబ్బందితో సమావేశాలు ఏర్పాటుచేసి ఓటరు అవగాహన సదస్సు నిర్వహించారు. ఓటరు ప్రతిజ్ఞ చేసి ప్రతి పోలింగ్ స్టేషన్ లో వంద శాతం పోలింగ్ అయ్యేలా ప్రతి ఒక్కరు సహకరించాలని తహసీల్దార్ ఆంజనేయులు కోరారు. ఈ క్రమంలో అధికారులతో పాటు అనధికారులు, రాజకీయ నాయకులు, యువజన సంఘాల ప్రతినిధులు అందరూ కలిసి ఓటింగ్ శాతాన్ని పెంచాలని తహసిల్దార్ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమాలలో ఎంపీడీఓ రాజా శ్రీనివాస్, ఎంపీవో సదశివావ్, ఏపీఎం కుంట గంగధర్, ఈజీఎస్ ఏపీవో విద్యానంద్, అన్ని శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అధికారి

కాంగ్రెస్‌లోకి భారీ చేరికలు



కాంగ్రెస్‌లో చేరిన పలువురు

నవతెలంగాణ-భీంగల్ రూరల్/డిచ్‌పల్లి

మండలంలోని పిప్రీ గ్రామానికి చెందిన విడీసీ అధ్యక్షుడు గురిజికింది రంజిత్, మాజీ అధ్యక్షుడు రౌతు యాదగిరి, రౌతు భూమన్న, తండా లింబన్న, తాండ దేవేందర్, తాంసరాజు, నవీన్, జంగం పురుషోత్తం, రౌతు శ్రీకాంత్, నాలకంటి దుర్గా, జంగం జలంధర్, మరో 20 మంది సోమవారం కాంగ్రెస్ పార్టీ నియోజకరవ్గ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారందరికీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

డిచ్‌పల్లి : తెలంగాణ రాష్ట్ర బీడి టేకేదారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు దుంపల నారాయణ సోమవారం నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి జీవన్‌రెడ్డి గెలుపు కోసం కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో నారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
3
కామారెడ్డి
మంగళవారం | ఏప్రిల్ 30, 2024 | www.navatelangana.com

ఉపాధి హామీ పనులు పరిశీలించిన ఎంపీడీవో

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూరు మండలంలో చేపడుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ కూలీల సంఖ్య పెంచాలని, ప్రతి ఒక్కరికి ఉపాధి కూలీ కల్పించి జీవనోపాధి కల్పించాలన్నారు. కూలీ పనులలో ఎలాంటి అవకతవకలు జరగకుండా చూడాలని పంచాయతీ కార్యదర్శులకు, ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. అలాగే ఉపాధి కూలీలకు వైద్య ఆరోగ్యశాఖ నుంచి అందజేస్తున్న ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, వైద్య సిబ్బంది ఉన్నారు.


పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని ఉపాధి హామీ పనులు జరుగుతున్న స్థలాల వద్ద ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి ఓఆర్ఎస్ ప్యాకెట్లను ఉపాధి హామీ కూలీలకు ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని కూలీలు పనులు చేస్తున్న సమయంలో శరీరంలో శక్తిని పెంపొందించడానికి జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేస్తున్నట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.


ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేస్తున్న ఆశావర్కర్లు

బయట వడగాలి..
ఇంట్లో ఉక్కపోత..

- ఉక్కిరిబిక్కిరవుతున్న జనాలు
- ఉదయం 9నుంచే భానుడి భగభగ
- అత్యవసరమైతేనే బయటకు వెళ్లాలంటున్న వైద్యులు



నవతెలంగాణ-రామారెడ్డి

'బయట వడగాలి.. ఇంట్లో ఉక్కపోత' ఇదీ ప్రస్తుత పరిస్థితి. దీంతో జనాలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఉదయం 9 నుంచే ఎండలు మండిపోతున్నాయి. ఈ ఎండలకు అత్యవసరమైతేనే ఇంట్లో నుంచి బయటకు వెళ్లాలని వైద్యులు సూచిస్తున్నారు.

కామారెడ్డి జిల్లాలో భానుడు భగ్గుమంటున్నాడు. రెండు రోజుల నుంచి జిల్లాలో వడగల్పులతోపాటు, 45 డిగ్రీలు, ఆపై ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రాగల ఐదు రోజులు భానుడి ప్రతాపం మరింత ఎక్కువగా ఉంటుందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. ప్రజలు ఉదయం 11గంటలలోపే పనులు ముగించుకోవలని సాధ్యమైనంత వరకు ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని, తప్పని పరిస్థితిలో తలపాక, తాగునీరు తప్పకుండా వెంట ఉంచుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. మండే ఎండలు, వీచే వడగాల్పులను తట్టుకుని నిలబడేందుకు ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. మధుమేహం, గుండె జబ్బుతో బాధపడేవారు, గర్భిణీలు, వృద్ధులు, పిల్లలు ఎండలో వెళ్లకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అంటున్నారు. శరీరం ఎండ వేడిమికి తట్టుకోవడానికి సాధ్యమైనంతవరకు ఎక్కువగా తాగునీరును శరీరానికి అందించాలని, వీటితోపాటు పండ్లరసాలు, పెరుగు, మజ్జిగ వంటి ద్రవ పదార్థాలను ఎక్కువగా తీసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. వాతావరణాన్ని దృష్టిలో ఉంచుకొని మద్యం, వేపుడు పదార్థాలు, మాంసాహారాలకు దూరంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. ఒకవేళ ఏదైనా అనారోగ్యంగా తీవ్రమైన తలనొప్పి, వాంతులు, విరోచనాలు, కండ్లు తిరగడం వంటి లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించాలని చెబుతున్నారు.

పాఠశాలకు సెలవు ఉండడంతో ఎండ వేడికి తట్టుకోవడంతో పాటు సరదా కోసం చెరువుల్లో, కుంటల్లో, కాలువలతో పాటు బావుల్లో విద్యార్థులు ఈతకు వెళ్లే అవకాశం ఉంది. ఈతరాక నీటమునిగి విద్యార్థులు మృత్యువాతపడిన ఘటనలు జిల్లాలో గతంలో చోటుచేసుకున్నాయి. కాగా విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల అప్రమత్తంగా ఉండాలని, జాగ్రత్తలు తీసుకోవాలని స్థానిక ఎస్సై కొండ విజయ్ ప్రజలకు సూచించారు.

జొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణంలో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో సింగిల్ విండో ద్వారా జొన్న పంట మద్దతు ధర కొనుగోలు కేంద్రాన్ని అధికారులు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మద్నూర్ సింగిల్ విండో కార్యదర్శి జె.బాబురావు మాట్లాడుతూ.. జొన్న పంట రైతులు మద్దతు ధర కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జొన్న పంట క్వింటాకు రూ.3,180 ప్రకటించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ కార్యదర్శి విఠల్, మార్కెట్ కమిటీ సూపర్‌వైజర్ సత్యం, మండల వ్యవసాయ విస్తీర్ణ అధికారులు అనిల్, సతీష్, జొన్న పంట రైతులు తదితరులు పాల్గొన్నారు.

వలసలను అరికట్టేందుకు
ఉపాధి హామీ చట్టం..

- దానిని తెచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమే
- జెడ్పీటీసీ ఏలేటి శ్రీలత సంతోష్‌రెడ్డి

నవతెలంగాణ-లింగంపేట్

వలసలను అరికట్టడానికి దేశమంతటా ప్రతి ఒక్కరికి పని కల్పించాలని ఉపాధి హామీ చట్టాన్ని తీసుకొచ్చింది కాంగ్రెస్ పార్టీ అని లింగంపేట్ జెడ్పీటీసీ ఏలేటి శ్రీలత సంతోష్ రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు ఆదేశాల మేరకు సోమవారం లింగంపేట్ మండలంలోని మొంబాజీపేట్, కంచుమాల్, కొండాపూర్, శెట్టిపల్లి సంగారెడ్డి గ్రామాలలో ఉపాధి హామీ పని ప్రదేశాల వద్దకు వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కూలీలను ఉద్దేశించి మాట్లాడుతూ.. ఉపాధి పనులు లేక ఎన్నో కుటుంబాలు పట్టణ ప్రాంతాలకు వలస వెళ్లి బతుకుతున్నారని వలసలను నివారించి ప్రతి ఒక్కరికి పని కల్పించాలని ఉద్దేశంతో ఉపాధి హామీని కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిందన్నారు. దీంతో లక్షలాది కుటుంబాల్లో మేలు జరిగిందన్నారు. ప్రతి ఒక్కరికి పని దొరుకుతుందన్నారు. బిజెపి మత రాజకీయం చేస్తుందని విమర్శించారు. మత పిచ్చి నుండి విముక్తి పొంది అభివృద్ధి చెందాలంటే మన అమూల్యమైన ఓటును కాంగ్రెస్ పార్టీ చేతి గుర్తుకు వేసి మన జహీరాబాద్ ఎంపీగా సురేష్ శెట్కార్‌కు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ ఒంటరి సిద్ధారెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షులు బుర్ర నారాగౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మైనారిటీ రఫియోద్దీన్, సర్పంచ్ రామ్‌రెడ్డి, అధ్యక్షులు ఫాతిద్దీన్, మాజీ ఎంపీపీ మోహిద్, లింగంపేట్ మాజీ సర్పంచ్ ఆఫ్రోజ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ దశరథ్, జొన్నల రాజు, లక్ష్మారెడ్డి, సూరయిపల్లి మాజీ సర్పంచ్ రాజశేఖర్‌రెడ్డి, పోతాయిపల్లి ఎంపీటీసీ దత్తు, సాజిత్, మైనార్టీ నాయకులు ఇర్ఫాన్, బాలరాజు గౌడ్, సిద్దు, పీర్‌సింగ్, సైయాద్, కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఒడిబియ్యంతో అన్నదానం

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని అడ్లూరు ఎల్లారెడ్డి గ్రామంలో శ్రీ రాముల వారి ఒడిబియ్యం వండి అన్నదానం చేశారు. అన్నదానంలో గ్రామస్తులంతా పెద్దఎత్తున పాల్గొన్నారు.

రెండు లక్షల బీమా చెక్కు అందజేత


కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న బ్యాంక్ మేనేజర్

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని లింగంపల్లి గ్రామానికి చెందిన పుర్ర రాములు గత కొన్ని నెలల క్రితం అనారోగ్యంతో మరణించడంతో మృతుని కుటుంబానికి సోమవారం ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ మేనేజర్ రాజేందర్ చేతుల మీదుగా రెండు లక్షల బీమా చెక్కును కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా మేనేజర్ రాజేందర్ మాట్లాడుతూ.. రాములు మండల కేంద్రంలోని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్‌లో పీఎంజేజేబీవై ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా యోజన పాలసీని చేసుకోగా.. ఆ పాలసీ డబ్బులు రాగ పుర్ర రాములు భార్య పుర్ర లక్ష్మికి ఇన్సూరెన్స్ డబ్బులు రూ.2లక్షల చెక్కును అందజేశారు. ప్రతి ఖాతాదారుడు బీమా ఖచ్చితంగా చేయించుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ రాము, సిబ్బంది జగన్, నరేందర్, శేఖర్, లింగంపల్లి బిజినెస్ కరస్పాండెంట్ బందెల కాంతం తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన కళ్యాపూర్ మాజీ సర్పంచ్


ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలో చేరిన మాజీ సర్పంచ్

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని కల్యాపూర్ మాజీ సర్పంచ్ మైనీ మోహన్ మాజీ మంత్రి, బోధన్ నియోజకవర్గ శాసనసభ్యులు ప్రొద్దుటూరు సుదర్శన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో సోమవారం చేరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఓ మోహన్, సాయినాథ్, లవన్ కుమార్ పాల్గొన్నారు.

పేరుకే చలివేంద్రం.. చుక్కా నీరు ఉండదు..


సాలూరలో మూసి ఉంచిన చలివేంద్రం

నవతెలంగాణ-బోధన్

గ్రామాలలో వేసవి ఉపశమనం నుంచి గ్రామస్తులకు చల్లని తాగునీరు అందించాలనే ఉద్దేశంతో అధికారులు గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో చలివేంద్రం కేంద్రాలు ఏర్పాటు చేశారు. లక్ష్యం ఉన్నతమైనదే కానీ.. ఆచరణలో మాత్రం గ్రామ పంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యంతో చలివేంద్రాలు నామమాత్రంగా కొనసాగుతున్నాయి. కొన్ని గ్రామ పంచాయతీల కార్యాలయం సమీపంలో చలివేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. కాని సమయానికి అక్కడ చల్లని తాగునీటి రంజన్‌లూ కనపడవు. రంజన్‌లు ఉన్న తాగునీటిని అందించే వారు ఉండరు. దాంతో అందులో చల్లని తాగునీరు ఉందో లేదో తెలియక జనం దాహంతో ఇబ్బందులు పడుతున్నారు.

సాలూర గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం నామ్‌కే వాస్తేగా ఏర్పాటు చేసినట్లు ఉంది. ఎందుకంటే అక్కడ సిబ్బంది తాగునీరు అందించడానికి అందుబాటులో ఉండరని విమర్శలు వస్తున్నాయి. సోమవారం చలివేంద్రం పరిశీలించగా మూసివేసి ఉంది. అత్యధిక స్థాయిలో ఉష్ణోగ్రతలు ఉండడంతో జనం చలివేంద్రం మూసి ఉండడంతో తాగునీటి కోసం ఇబ్బందులు పడవలసి వచ్చింది. అధికారులు తక్షణమే స్పందించి వేసవికాలం ముగిసే వరకు చలివేంద్రాలు సక్రమంగా కొనసాగేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఉపాధి హామీ తొలగింపునకు కేంద్రం కుట్ర

- ఉపాధి హామీ బోధన్ నియోజకవర్గ కోఆర్డినేటర్ మెగావత్ సరిదాస్


ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-రెంజల్

ఉపాధి హామీ చట్టాన్ని దశలవారీగా నిర్వీర్యం చేయడానికి కేంద్ర ప్రభుత్వం యోచి స్తుందని ఉపాధి హామీ బోధన్ నియోజకవర్గ కోఆర్డినేటర్ మెగావత్ సరిదాస్ స్పష్టం చేశారు. సోమవారం మండలంలోని కూనే పల్లి, వీరన్నగుట్ట తండా, గండిగుట్ట తండా గ్రామాలలో ఆయన పర్యటించి కాంగ్రెస్ ప్రభుత్వం పథకాల గురించి వివరించారు. మాజీ మంత్రి బోధన్ శాసనసభ్యులు పి.సుదర్శన్ రెడ్డి ఆదేశాల మేరకు రెంజల్ కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు మోబిన్ ఖాన్ అనుమతితో మండలంలో పర్యటిం చినట్లు ఆయన పేర్కొన్నారు. పేద ప్రజల అభివృద్ధి కోసం అప్పట్లో కాంగ్రెస్ ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ చట్టాన్ని ప్రవేశపెట్టగా దానిని దశలవారీగా తొలగించడానికి బిజెపి ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఆయన స్పష్టం చేశారు. గత 60 సంవత్సరాలలో కాంగ్రెస్ ప్రభుత్వం అనేక పబ్లిక్ సెక్టార్ యూనిట్స్ ఏర్పాటు చేయగా, బిజెపి ప్రభుత్వం పెట్టుబడిదారు లకు అప్పగించడానికి ప్రయత్నాలు చేస్తుందని ఆయన అన్నారు. బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జీవన్‌రెడ్డికి మీ అమూల్యమైన ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు.

ఎంపీ అభ్యర్థి సురేష్ షెట్కార్ గెలుపు కోసం పాదయాత్ర


పూజలు చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని పోల్కంపేట కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు కలాలి అజయ్‌గౌడ్ ఆధ్వర్యంలో యువజన కాంగ్రెస్ నేతలు త్వరలో జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో జహీరాబాద్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి సురేష్ షెట్కార్ భారీ మెజారిటీతో గెలవాలని సోమవారం కామారెడ్డి నుంచి రామారెడ్డిలోని కాలభైరవ దేవాలయం వరకు పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా అజయ్‌గౌడ్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు నాయకత్వంలో తాము జహీరాబాద్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి సురేష్ షెట్కార్ భారీ మెజారిటీతో గెలవాలని కాలభైరవ స్వామి ఆలయం వరకు పాదయాత్రగా చేసినట్లు తెలిపారు. పాదయాత్రలో గ్రామ కమిటీ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, యూత్ అధ్యక్షుడు సాయిబాబా, యువనేతలు నాగరాజ్, రాజు, చింటూ, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ ప్రదేశాల్లో నాయకుల ప్రచారం


ఉపాధి హామీ ప్రదేశంలో ప్రచారం చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-గాంధారి

మండలంలోని ఖర్గుల్, బొప్పా జువ్వడి, కరక్‌వాడి గ్రామంలో ఉపాధి హామీ కూలీలకు కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోను వివరించారు. వచ్చే లోక్‌సభ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షులు గణేష్, సంగాని బాబా, అహ్మద్, ఈశ్వర్, జువ్వాడి వినయ్, నాగరాజు, మల్లమర్రి భాస్కర్, శ్రీధర్, రవి, సాయిలు, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆశయలకు అనుగుణంగా పనిచేశా

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని దోన్గాం గ్రామ పంచాయతీ పరిధిలోని శక్తినగర్‌లో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలో జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే షిండే అంబేద్కర్ విగ్రహానికి, చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లులర్పించారు. అనంతరం గ్రామస్తులు మాజీ ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా షిండే మాట్లాడుతూ.. అంబేద్కర్ ప్రవేశపెట్టిన రిజర్వేషన్ వల్లే ప్రభుత్వ ఉద్యోగం సాధించానని, జుక్కల్ నియోజకవర్గ ప్రజలకు సేవచేయాలనే ఉద్దేశంతో ఉద్యోగానికి రాజీనామా చేశానని తెలిపారు. మారుమూల ప్రజల వెనుకబాటుకు, ఆర్థిక అభివృద్ధి సాధించాలని, అసమానతలు తొలగించాలనే ఉద్దేశంలో అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా పనిచేశానని ప్రజలు తనను ఎమ్మెల్యేగా పలుమార్లు గెలిపించారని గుర్తుచేసుకున్నారు. ప్రపంచ దేశాలకు ఆదర్శంగా రాజ్యాంగం నిర్మించి విదేశీయులు కూడా మెచ్చుకునే విధంగా అపర మేధావి మన దేశంలో పుట్టడం గొప్ప అన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కళావతి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.


చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే

మేడే పోస్టర్ల ఆవిష్కరణ

నవతెలంగాణ-బోధన్

పట్టణంలో ఐఎఫ్టీయూ ఆధ్వర్యంలో మేడే పోస్టర్లను నాయకులు సోమవారం ఆవిష్కరించారు. 138వ మేడే స్ఫూర్తితో కార్మిక హక్కుల కోసం పోరాడుదామని ఐఎఫ్టియూ జిల్లా కోశాధికారి దాల్మల్కి పోశెట్టి కార్మికులకు పిలుపునిచ్చారు. ఐఎఫ్‌టియు జాతీయ కమిటీ మతోన్మాద ఫాసిస్టు బిజెపి విధానాలకు వ్యతిరేకంగా మేడేను నిర్వహించాలని పిలుపునిచ్చిందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సురేష్, మక్కయ్య, ప్రకాష్, కనకవ్వ శ్రావణ్, అంజయ్య, మహేష్, బాబు, సత్యం, నవాబు, శంకర్, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

మేడేను జయప్రదం చేయండి


- సిఐటీయూ జిల్లా సభ్యుడు సురేష్ గొండ



నవతెలంగాణ-జుక్కల్

మేడేను జయప్రదం చేయాలని సిఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు సురేష్ గొండ పిలుపు నిచ్చారు. సోమవారం తెలిపారు. జుక్కల్ మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద మే 1న సిఐటీయూ జెండావిష్కరణ కార్యక్రమం ఉంటుందని, కావున మండలంలోని సిఐటీయూ అనుబంధ సంఘాల కార్మికులైన అంగన్‌వాడీ, ఆశా, గ్రామ పంచాయతీ, మధ్యాహ్న భోజన ఏజెన్సీ, ఆల్ హమాలీ కార్మికులు, ఆటో యూనియన్ కార్మికులు జెండావిష్కరణకు తప్పక హాజరై విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

పిడిఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా అనుముల సతీశ్



నవతెలంగాణ-గాంధారి

ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్‌యూ) రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశంలో కామారెడ్డి జిల్లా గాంధారి మండలానికి చెందిన అనుముల సతీష్‌ను రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఎన్నికకు సహకరించిన రాష్ట్ర కార్యవర్గానికి సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. ఇక నుంచి మరింత అంకితభావంతో విద్యార్థుల సమస్యలపట్ల, విద్యారంగంలో వచ్చే సమస్యల పట్ల విద్యార్థులను కలగలుపుకొని శాస్త్రీయ విద్య సాధనకై, సమసమాజ స్థాపనకై పోరాడుతానని తెలిపారు.

అంతర్జాతీయ నృత్య దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-ఆర్మూర్



అంతర్జాతీయ నృత్య దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం పట్టణంలోని గంగ హాస్పిటల్ ఎదురుగా గల నటరాజు నృత్య నికేతన్‌లో చిన్నారులతో కలిసి వేడుకను అట్టహాసంగా నిర్వహించారు. ఇందులో భాగంగా నృత్య గురువు భాశెట్టి మృణాళిని మాటాడుతూ.. ప్రతి ఒక్కరూ తమ రోజువారి జీవనశైలిలో నృత్యాన్ని అలవర్చుకోవాలని. దీనివల్ల మానసిక శారీరక ప్రయోజనాలు చాలా ఉన్నాయని తెలిపారు. ఈ సందర్భంగా చిన్నారుల నృత్యాలు చూపరులను అలరించాయి.

ముందే వికసించిన 'మే పుష్పం'

నవతెలంగాణ-డిచ్‌పల్లి



ప్రపంచంలోనే ప్రకృతి ధర్మం పాటిస్తు ప్రతి సంవత్సరం మే నెలలో వికసించే మేపుష్పం మేనెల ప్రారంభానికి ముందే వికసించింది. తెలంగాణ యూనివర్సిటీలో వృక్ష విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ (కాంట్రాక్ట్‌గా పనిచేస్తున్న డాక్టర్ దేవరాజు శ్రీనివాస్ ఇంటి అవరణలో విరబూసినట్లు డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. ఈ మేపుష్పం మంచి ఔషధ గుణాలు కలిగి ఉంటుంది. పాము కాటుకు, డయోరియ వాంటి వ్యాధులను నయం చెయ్యడంలో ఈ మొక్క ఉపయోగపడు తుందిడిది అమరిల్ల డిమెసియో కుటుంబానికి చెందిన సెడాక్సస్ మల్టి ఫ్లోరోస్' దాని శాస్త్రియ నామం అని శ్రీనివాస్ పేర్కొన్నారు.

మోడీ, ఎంపీ అరవింద్‌ను ఓడించాలి

- రైతు ఐక్య కార్యాచరణ కన్వీనర్లు

నవతెలంగాణ-ఆర్మూర్

రైతులను మోసం చేసిన ప్రధాని నరేంద్ర మోడీని, ఎంపీ అభ్యర్థి అరవింద్‌ను ఓడించాలని-రైతు ఐక్య కార్యాచరణ కన్వీనర్లు వి. ప్రభాకర్ ,,మంథని గంగారాం, దేగాం యాద గౌడ్, సుంకేట అన్వేష్ రెడ్డి అన్నారు. రైతు ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో పట్టణ కేంద్రంలోని ఎమ్మార్ గార్డెన్‌లో సోమవారం లింగారెడ్డి అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణలో 2019 ఎన్నికల్లో రైతులను మోసం చేయడానికి వారం ఐదు రోజుల్లో పసుపు బోర్డును,పసుపు మద్దతు ధర పసుపును ఎంఎస్‌పీ జాబితాలో చేరుస్తానని తనని నమ్మకుంటే బాండ్ పేపర్ రాసిస్తా అని అరవింద్ బాండ్ పేపర్ రాసి రైతులను మోసం చేశారని వారు అన్నారు. 2019 ఎన్నికల్లో కేవలం పసుపు బోర్డు ఏర్పాటు ధేయంగా పసుపు కు మద్దతు ధర 15 వేల రూపాయలను ప్రకటించాలని, ఎంఎస్‌పి జాబితాలో పసుపును చేర్చాలని జరిగిన ఉద్యమాల్లో అనేకమందిని జైలు పాలు చేశారని తెలిపారు. ఎంపీగా పోటీ చేస్తున్న కవితని గద్దదించాలని ఉద్యమం కొనసాగిందని అందులో భాగంగానే 178 పైచిలుకు మంది రైతులు కలిసి నామినేషన్ వేయడం జరిగిందని ఆ కోణంలో భాగంగానే అరవింద్ రైతులకు అనేక హామీలు ఇచ్చి గెలుపొందారని వారు అన్నారు. నేటికీ అవి అమలుకాలేదన్నారు. మరో పక్కన అరవింద్ స్పైసెస్ బోర్డు వల్ల అనేక లాభాలు ఉన్నాయని రైతులను మోసం చేసే కుట్రలు చేశారని వారు అన్నారు. 13 నెలల పాటు ఢిల్లీలో జరిగిన రైతు ఉద్యమాన్ని అణిచివేయడానికి నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రయత్నించిందన్నారు. నరేంద్ర మోడీ తెలంగాణలో ఒక బహిరంగ సభలో మాట్లాడుతూ పసుపు బోర్డును ఏర్పాటు చేస్తున్నామని చెప్పారని, (వారు విడుదల చేసిన గజిట్ లో) కానీ పసుపు బోర్డు ఎక్కడ పెడుతున్నారనే అంశాన్ని, పసుపు బోర్డు విధివిధానాలు కరువయ్యా అని వారు అన్నారు. బిజెపి మతం పేరుతో ప్రజల మధ్య చిచ్చులు పెట్టి ఓట్లను చీల్చి గెలుపొందాలని అనుకుంటుందని వారు ఉన్నారు. కన్వీనర్ బి దేవారం. మాట్లాడుతూ 2014 ఎన్నికల్లో స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేస్తామని, రైతులను మేలు చేసే విధంగా చట్టాలు తీసుకొస్తానని చెప్పారన్నారు. రైతులను, ప్రజలను కార్మికులను మోసం చేస్తున్న అరవింద్ నరేంద్ర మోడీ బిజెపి ప్రభుత్వానికి ఈ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని వారు పిలుపునిచ్చారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలోని పలు తీర్మానాలు చేశారు. ప్రతి నియోజకవర్గంలో మూడు గ్రామాలను ఎంపిక చేసుకొని గ్రామంలో బహిరంగ సభను ఏర్పాటు చేయాలని, 50వేల కరపత్రాలతో ప్రతి ఇంటింటికి అరవింద్‌ను ఓడించాలని ప్రచారం నిర్వహించాలని, రెండు మూడు ప్రచార వాహనాలతో బ్యానర్లు కట్టి ప్రతి నియోజకవర్గంలో తిరిగి ప్రచారం నిర్వహించాలి తీర్మానించారు. రౌండ్ టేబుల్ సమావేశంలో రైతు ఐక్య కార్యాచరణ నాయకులు జగిత్యాల రైతు నాయకులు తిరుపతి రెడ్డి, రాజారెడ్డి, శ్రీనివాస్ జలందరి,,వెంకటేష్ గౌడ్, దేవేందర్ గౌడ్, మోహన్ రెడ్డి, సారా సురేష్, అశోక్, నరేంధర్, 5 శాసనసభ నియోజకవర్గాల్లోని రైతులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

సొంతగూటికి చేరిన తాజా మాజీ సర్పంచ్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మొన్న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్‌పార్టీలో చేరిన డిచ్‌పల్లి మండలంలోని నాకతండాకు చెందిన తాజా మాజీ సర్పంచ్ తారా సింగ్ కాంగ్రెస్ పార్టీ 6 గారంటీ హామీలు అబద్దాలని తెలిసి అమలు చేసే అవకాశం లేనందున కాంగ్రెస్ పార్టీలో ఉన్న నాయకుల ధోరణి నచ్చక తిరిగి బీఆర్ఎస్‌లో చేరినట్టు తెలిపారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్దన్ సోమవారం గులాబీ కండువావేసి పార్టీలోకి ఆహ్వానించారు. రానున్న ఎంపీ ఎన్నికల్లో గ్రామస్థాయిలో బీఆర్ఎస్ పార్టీ చేసిన అభివృద్ధి పనులను సీఎం కేసీఆర్ నాయకత్వాన్ని ప్రజలకు వివరించాలని బాజిరెడ్డి గోవర్దన్ సూచించారు. కార్యక్రమంలో జెడ్పిటిసి లక్ష్మీనర్సయ్య, సీనియర్ నాయకులు పద్మారావు, శక్కరి కోండ కృష్ణ, చాకలి సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

తెలంగాణ రాష్ట్ర బీడి టేకేదారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు దుంపల నారాయణ నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతి రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

వరి కుప్పపై పడి ఒకరికి తీవ్ర గాయాలు

- రోడ్లపైన వరి ధాన్యాం ఆరబోస్తే చర్యలు : ఎస్ఐ

నవతెలంగాణ-డిచ్‌పల్లి

వరి కుప్పపై పడి ఒకరికి తీవ్ర గాయాలైన ఘటన డిచ్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఖిల్లా డిచ్‌పల్లి గ్రామం వద్ద ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై మహేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఖిల్లా డిచ్ పల్లి నుండి రైల్వేస్టేషన్‌కు వచ్చే దారిలో కొందరు రైతులు రోడ్లపైన వరి ధాన్యాం ఆరబోశారని అన్నారు. రాత్రి సమయంలో మండలంలోని అమృతాపూర్ గ్రామానికి చెందిన కుందేటి శ్రీకాంత్ ఖిల్లా డిచ్ పల్లి గ్రామం నుండి అమృతాపూర్ గ్రామానికి వస్తున్నాడు. రోడ్డుపైన ఉన్న ధాన్యం కుప్ప ఉండడంవల్ల ప్రమాద వశాత్తు పడటంతో తీవ్ర గాయాలపాలైనట్లు ఎస్సై వివరించారు. ఈ ఘటనా విషయమై బాధితుడి భార్య కుందేటి వనిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రజలందరికీ విజ్ఞప్తి...

రైతులు రోడ్లపైన వడ్లను కానీ ఇతర ధాన్యాన్ని గాని ఆరబోయకూడదని ఆరబోసినట్లయితే చట్టప్రకారం తగు చర్యలు తీసుకుంటామనిఎస్సై మహేష్ తెలిపారు. ఇప్పటికే పలువురు కుప్పలపై పడి గాయాలైన సంఘటనలు అనేకం ఉన్నాయని అన్నారు.

చేపల వేటకు వెళ్ళి ఒకరు మృతి

నవతెలంగాణ-డిచ్‌పల్లి



ధర్పల్లి మండలంలోని చెల్లగరిగా గ్రామానికి చెందిన మీసాల సాయిలు (54) డిచ్‌పల్లి మండల కేంద్రంలోని బస్టాండ్ దగ్గర గల చెరువులో చేపలు పడుతుండగా ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందినట్లు ఎస్సై మహేష్ సోమవారం తెలిపారు. మృతుని కుమారుడు మీసాల సాగర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించినట్లు ఎస్సై వివరించారు.

చెరువులో దూకి మహిళ ఆత్మహత్య

నవతెలంగాణ-ముప్కాల్



మండల కేంద్రానికి చెందిన అల్లెపు రుకుంబాయి (55) మంగళవారం మనస్తాపానికి గురై స్థానిక ఉర చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ భాస్కరా చారి తెలిపారు.

కొడుకు అప్పుల విషయంలో

మనస్థాపానికి గురై తల్లి ఆత్మహత్య

నవతెలంగాణ-బాల్కొండ

మండల పరిధిలోని కిసాన్ నగర్ గ్రామానికి చెందిన పాత్యాల చిన్నుబాయి (70) తన కొడుకు అప్పుల విషయంలో మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకుంది. చిన్నుబాయి కొడుకు ప్రవీణ్‌కు అయిన అప్పుల విషయంలో ఆమె కొంతకాలంగా బాధపడుతున్నది. ఈ అప్పుల విషయంలో మనస్థాపానికి గురై ఆదివారం రాత్రి 10గంటల సమయంలో కిసాన్ నగర్‌లోని ఎస్సారెస్పీ వరద కెనాల్ బ్రిడ్జి వద్ద నీటిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. కొడుకు పాత్యాల ప్రవీణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ శంకర్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



నేడు రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్

నవతెలంగాణ-ముప్కాల్

రైతు నేస్తం' వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఉదయం 10గంటలకు మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతులతో పంట సాగుపై శిక్షణ సమావేశం ఏర్పాటు చేయడం జరుగుతుందని మండల వ్యవసాయాధికారి రాజ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేసవి కాలంలో కూరగాయలు సాగు, పచ్చి రొట్ట ఎరువులు వాడకం, సమస్యాత్మక నేలల యాజమాన్యం తదితర అంశాలపై అవగాహన కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. వివిధ జిల్లాలకు చెందిన సాగు సమస్యలు సందేహాల గూర్చి శాస్త్రవేత్తలతో చర్చ కార్యక్రమం ఉంటుందని, ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

సామూహిక ఇసీసీఇడే

నవతెలంగాణ-మాక్లూర్

ఆలూరు మండలంలోని అంగన్‌వాడి కేంద్రంలో సామూహిక ఎర్లీ చిల్డ్రన్ కేర్ అండ్ ఎడ్యుకేషన్ ఫ్రీ స్కూల్ ఎడ్యుకేషన్ డే కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ సునీత పాల్గొని రెండున్నర సంవత్సరాల పిల్లలను నర్సరీలో, మూడున్నర సంవత్సరాల పిల్లలను ఎల్‌కేజి లో, నాలుగున్నర సంవత్సరాల పిల్లలను యుకేజిలో చేర్పించడం జరుగుతుందని అన్నారు. ఈ అవకాశాన్ని సద్వినయోగం చేసుకోవాలని పిల్లల తల్లులు సూచించారు. వచ్చే సంవత్సరం ఫ్రీ స్కూల్ పాంప్లేట్స్ పంచడం, అసైన్మెంట్ కార్డ్స్ ఇవ్వడం జరిగింది. పౌష్టిక ఆహారంతోపాటు విద్యను కూడా అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ పద్మ, అంగన్ వాడి టీచర్లు అంజమ్మ సరోజ ఫ్రిస్కూల్ పిల్లల, తల్లులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించుకుందాం

నవతెలంగాణ-విలేకరులు

భీంగల్‌రూరల్ :కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి జీవన్ రెడ్డిని గెలిపించుకుందామని మాజీ జడ్పీటీసీ జగిత్యాల శోభక్క అన్నారు. మండలంలోని జాగిరియాల్, కుప్కల్, గోన్‌గొప్పుల, సికింద్రాపూర్, బెజ్జొర గ్రామాల్లో ఉపాధిపని ప్రదేశాల్లో సోమవారం ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో చెరుకుపల్లి నరసింహ రెడ్డి (మాజీ సొసైటీ చైర్మన్), బోజాగౌడ్ (జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి), మండల అధ్యక్షుడు బొదిరె స్వామి, నాగేంద్ర (బాల్కొండ నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు), చరణ్ గౌడ్ (గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు), ప్రవీణ్ గౌడ్ (మాజీ ఉపసర్పంచ్), ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

బాల్కొండ :కాంగ్రెస్ నాయకులు సోమవారం మండల పరిధిలోని అన్ని గ్రామాలలో ఉపాధి హామీ కూలీల వద్దకు వెళ్లి కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డికి ఓటు వేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న పథకాల గురించి కూలీలకు వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్, నాయకులు గుండేటి పెద్దోళ్ల మోహన్‌రెడ్డి, సంజీవ్‌గౌడ్, కుందారపు శ్రీనివాస్, యునుస్, విక్కీ, జావిద్, తౌట్ గంగాధర్, అన్వర్, అశోక్, సతీష్, పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.

ఏర్గట్ల:మండలంలోని తడపాకల్, బట్టాపూర్, తొర్తి గ్రామాల్లో వివిధ ప్రదేశాల్లో పని చేస్తున్న ఉపాధిహామీ కూలీల వద్దకు బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ రెడ్డి వెళ్ళి సోమవారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత ఐదు గ్యారంటీలను అమలుపరచామని, ఆగస్టు 15 లోపు ఏకకాలంలో 2 లక్షల రూపాయల రైతు రుణమాఫీ చేస్తామని అన్నారు. వచ్చే ఖరీఫ్ సీజన్‌కు వరి పంటకు క్వింటాలుకు 500 బోనస్ ఇస్తామని, ఉపాధిహామీ కూలీలకు 400 రూపాయలకు కూలి పెంచుతామని అన్నారు. పేద మహిళలకు సంవత్సరానికి లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందిస్తామని, గ్రామాలకు కావలసిన అభివృద్ధి పనులు చేస్తామని తెలిపారు.ఈ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మరోసారి అండగా ఉండి ఎంపీ అభ్యర్థి జీవన్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు సోమ దేవరెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు శివన్నోళ్ళ శివకుమార్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆడేం గంగప్రసాద్, నాయకులు జింక అనిల్, మహేష్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.



ఏర్గట్ల : మాట్లాడుతున్న సునీల్‌రెడ్డి

ముప్కాల్:మండలకేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి టి.జీవన్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని మాజీ సర్పంచ్ కొమ్ముల శ్రీనివాస్ అన్నారు. ఉపాధిహామీ కూలీల వద్దకు వెళ్లి వారు మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు బూత్‌ల వారిగా ఇంటింటికీ తిరుగుతూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని ఎంపీగా గెలిపించాలంటూ ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మాజీ సర్పంచ్ కొమ్ముల శ్రీనివాస్, నాయకులు పోల ప్రవీణ్, లోక సుభాష్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, ముస్కు శ్రీనివాస్, మల్లారెడ్డి, నేర బాబు రావ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు..



బాల్కొండ: మాట్లాడుతున్న నాయకులు

బాజిరెడ్డి గోవర్ధన్ గెలుపునకు కృషి చేయాలి

- మాజీ ఎమ్మెల్సీ విజి గౌడ్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

గత నాలుగు నెలల కాంగ్రెస్ ప్రభుత్వం తో ప్రజలు విసుగు చెందారని, నాలుగు పర్యాయాలు ఎమ్మెల్యేగా చేసిన బాజిరెడ్డి గోవర్దన్ కు ఈసారి పార్లమెంటులో ప్రజల పక్షాన నిలబడి మాట్లాడే అవకాశం కల్పించాలని మాజీ ఎమ్మెల్సీ వి గంగాధర్ గౌడ్ అన్నారు. సోమవారం ఎంపీపీ బాదవత్ రమేష్ నాయక్, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు చిలువేరి గంగదాస్‌తో కలిసి ఇందల్ వాయి మండలంలోని గన్నారం, సంస్థాన్ సిర్నపల్లి, నల్లవెల్లి,మేగ్య నాయక్ తండాలలో బూత్ కమిటీ, మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన ముస్లిం ముఖ్యులతో సమావేశం నిర్వహించి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ శాసన సభా ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదని, మరోసారి ప్రజలకు మోసగించడానికి అమలుకాని హామీ లను ఇస్తుందన్నారు. బిజెపి పార్టీ అబివృద్ధి చేయకుండా కులాల, మతాల మధ్య చిచ్చుపెట్టి లబ్ధి పొందాలని చుస్తుందన్నారు. ప్రతి ఒక్క కార్యకర్త బుత్ ల వారిగా అదిక మెజార్టీ వచ్చే విధంగా చూడాలని సూచించారు. ఐదేళ్ళుగా ఉన్న నిజామాబాద్ ఎంపి వల్ల ఎలాంటి అబివృద్ధి జరగలేదని, మరోసారి అలాంటి మనిషికి ఓటు వేయొద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి జగిత్యాలలో ఉంటు జిల్లాను పట్టించుకోరని అలాంటి వారిని ఎన్నుకోవద్దని సూచించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ బుసని అంజయ్య,గడ్కోల్ శ్రీనివాస్, తిర్మన్ పల్లి ఎంపిటిసి చింతల దాస్,కుంట నర్సారెడ్డి,మోహన్ నాయక్, రూరల్ బిఆర్ఎస్ ఎస్సీ సెల్ కన్వీనర్ పాశం కుమార్, పార్టీ మండల ఉపాధ్యక్షులు బిరిష్ శెట్టి, కచ్చకాయల శ్రీనివాస్, చందర్ నాయక్, అన్వర్ ఖురేషి, షేక్ జహంగీర్,జామీర్, ఇర్ఫాన్ ఖురేషి, తదితరులు పాల్గొన్నారు.

ఫాసిస్టు మూకల దాడిని ఖండిద్దాం

- పిడిఎస్‌యూ

నవతెలంగాణ-డిచ్‌పల్లి

సమూహ ఆధ్వర్యంలో కాకతీయ యూనివర్సిటీలో ఆదివారం జరిగిన 'లౌకిక విలువలు-సాహిత్యం' అనే సదస్సులో చొరబడి ఫాసిస్టు మూక అల్లరి సృష్టించడాన్ని, ప్రముఖ కవులు డాక్టర్ పసునూరి రవీందర్, మెర్సీ మార్గరెట్, నరేష్కుమార్ సూఫీ, అన్వర్, భూపతి వెంకటేశ్వర్లు, బిళ్ళ మహేందర్ తదితరుల మీద దాడి చేసి గాయపర్చడాన్ని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్‌యూ) తీవ్రంగా ఖండించింది. సోమవారం మండల కేంద్రంలో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నామాల ఆజాద్ మాట్లాడుతూ.. దేశంలో లౌకిక ప్రజాస్వామ్య విలువలను కాపాడుకోవాలనే లక్ష్యంతో రాజ్యాంగ స్ఫూర్తితో సాహిత్య సదస్సు జరుపుతుంటే ఫాసిస్టు మూక దాడికి పాల్పడటం దారుణమని అన్నారు. భావ ప్రకటనా స్వేచ్ఛ మీద దాడి చేయడమే అని భావిస్తున్నామని తెలిపారు. ప్రగతిశీల, ప్రజాస్వామిక, విప్లవ ఉద్యమాలకు కేంద్రమైన వరంగల్ గడ్డమీద ఎబీవీపి, ఆరెస్సెస్, సంఘ్ పరివార్ గూండాల దాడి ప్రజాస్వామ్యానికి పొంచి వున్న ప్రమాదాన్ని స్పష్టం చేస్తుందని వివరించారు. మతం మత్తులో సంఘ్ పరివార్ శక్తులు ప్రజాస్వామ్యంపై చేసిన దాడిని నిరసిస్తూ ఘటనకు కారకులైన వారిని వెంటనే అరెస్టుచేసి, కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పిడిఎస్‌యూ నిజామాబాద్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.నరేందర్, డాక్టర్ కర్క గణేష్, జిల్లా ఉపాధ్యక్షులు ఎల్.అనిల్ కుమార్, జిల్లా కోశాధికారి నిఖిల్, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లోని పనులు

సొంత పనుల్లా చేయించాలి : ఎంపీడీవో

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి



పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

పాఠశాల మరమ్మత్తు పనులు సొంత పనులు స్వీకరించాలని ఎంపీడీవో సతీష్ కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని గనియా తండా, నూర్సింగ్ తండా, ప్రాథమిక పాఠశాలను సందర్శించి అమ్మ ఆదర్శ కమిటీ, ప్రధానోపాధ్యాయులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ప్రధానోపాధ్యాయులు, మహిళా గ్రామ సంఘం ప్రతినిధులు అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు పాఠశాలను తమ సొంత ఇల్లుగా భావిస్తూ పనులు చేపట్టాలని సూచించారు. ఆయన వెంట పంచాయతీరాజ్ ఎఇ సురేంద్ర వర్మ ఐకెపి కమ్యూనిటీ కోఆర్డినేటర్ గ్రామ సంఘం అధ్యక్షురాలు సురేఖ, వీవోఏ కవిత, తదితరులు పాల్గొన్నారు.

138వ మేడేను జయప్రదం చేయండి

- ఐఎఫ్‌టీయు జిల్లా సహాయ కార్యదర్శి జెపి.గంగాధర్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

138వ మేడేను జయప్రదం చేయాలని, కార్మిక లోకానికి ఐఎఫ్టియు జిల్లా సహాయ కార్యదర్శి జెపి.గంగాధర్ పిలుపు నిచ్చారు. సోమవారం డిచ్‌పల్లి మండల కేంద్రంలో మేడే పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో బిజెపి ప్రభుత్వం పదేళ్లైన కార్మికులకు చేసిందేమీ లేదన్నారు. యూవతకు ప్రతి ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని మోసం చేసిన మోడీని తప్పనిసరిగా ఓడించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. దేశ సంపదను ఆదాని, అంబానీలకు దోచిపెట్టి మన దేశాన్ని దివాళ తీయిస్తున్నది నరేంద్ర మోడీ అన్నారు. రాముడు పేరుతో రామ మందిరం పేరుతో ప్రజలను మోసంచేసే కుట్ర ఉందన్నారు. మరోసారి ప్రధానమంత్రిగా ఎన్నుకుంటారని కళలు గంటున్నారని ఎద్దేవాచేశారు. ఈ ఎన్నికల్లో బిజెపి ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని ప్రజలను కోరారు. ఈ పోస్టర్ ఆవిష్కరణలో జిల్లా నాయకులు సుప్రియ, లక్ష్మి, సృజన, అరుణ, భావన, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో రాణించాలి

- బేస్‌బాల్ ఛాంపియన్లకు సత్కారం

నవతెలంగాణ-సిరికొండ



ఛాంపియన్లకు జ్ఞాపికలు అందించి సత్కరించిన ప్రిన్సిపాల్

విద్యార్థులు హైదరాబాద్ రీజియన్ ఎం.యల్‌బి ఛాంపియన్‌గా నిలవడం అభినందనీయమని, ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ క్రీడా నైపుణ్యాలను మెరుగుపరుచుకొని జాతీయ స్థాయిలో రాణించాలని సత్యశోధక్ ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య అన్నారు. హైదరాబాద్ రీజియన్ (తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు కలిపి) మేజర్ లీగ్ బేస్ బాల్ (ఎంయల్‌బి) కప్ అండర్ 12 ఛాంపియన్ గా నిలిచిన సత్యశోధక్ పాఠశాల జట్టు క్రీడాకారులను ఆదివారం పాఠశాలలో సత్కరించారు పాఠశాలకు చెందిన పి. హేమంత్, డి.శ్రీకాంత్, కె.హర్షవర్ధన్, జి.విశాల్ డి.అన్వేష్, బి.తిరుపతి, యస్ . స్నేహిత్, కే . శ్రీకాంత్, బి.సాత్విక్, జి.ప్రదీప్, బి హర్షిత్, కె. అజయ్‌కు ప్రత్యేక జ్ఞాపికలను అందించి సత్కరించారు పాఠశాల జట్టు కోచ్ మేనేజర్లుగా వ్యవహరించిన వ్యాయమ ఉపాధ్యాయులు అనిల్, సంతోష్‌ను అభినందించారు ఈ సందర్భంగా నర్సయ్య మాట్లాడుతూ విద్యార్థులు నిరంతర సాధనతోనే క్రీడల్లో రాణించవచ్చని అన్నారు. జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరుచుటకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గంగారెడ్డి, శ్రీనివాస్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పేద కుటుంబానికి ఉపాధి పరికరాలు అందజేత

నవతెలంగాణ-భీంగల్‌రూరల్



లక్ష్మీకి సాయం అందించిన గంగస్వామి

భీమ్గల్ పట్టణ కేంద్రానికి చెందిన జిఎస్ ఫోర్ ఎస్ గంగస్వామి ఫర్ సొసైటీ ఆధ్వర్యంలో బాచన్ పల్లి గ్రామానికి చెందిన లక్ష్మీ కుటుంబానికి టిఫిన్ సెంటర్ కు సంబంధిం చిన సామాగ్రిని అందజేసి ఉపాధికి భరోసా కల్పించారు. పేద కుటుంబానికి చెందిన లక్ష్మి భర్త, కుమారుడు చనిపోవడంతో బతుకుదెరువు కోసం చిన్న హోటల్ నడుపుకొంటూ జీవనం సాగిస్తుంది. ఈ విషయాన్ని తెలుసుకున్న గంగస్వామి తన జన్మ దినం సందర్భంగా పూర్తి ఖర్చులతో ఒక టిఫిన్ సెంటర్ ఏర్పాటు చేయిస్తామని మాట ఇచ్చిన రెండు రోజుల్లోనే సామాగ్రిని అందజేసి ఉపాధికి భరోసా కల్పించారు. ఈ సందర్భంగా లక్ష్మి ఏర్పాటు చేసిన టిఫిన్ సెంటర్‌కు ముఖ్యఅతిథిగా గంగాస్వామిని ఆహ్వానించి ఆయన చేతుల మీదుగా ప్రారంభోత్సవాన్ని చేశారు. కార్యక్రమంలో జిఎఫ్ ఫోర్ ఎస్ సొసైటీ సభ్యులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వివాహిత మృతి



నవతెలంగాణ-కామారెడ్డి డెస్క్

రోడ్డు ప్రమాదంలో వివాహిత మృతి చెందింది. ఈ ఘటన కామారెడ్డి జిల్లా పెద్దకొడప్‌గల్ మండల కేంద్రంలోని ఎల్కంటి చెరువు సమీపంలో 161వ జాతీయ రహదారిపై సోమవారం చోటుచేసుకుంది. ఎస్సై కోనారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కుర్మ యాదు గోండ అనే యువకుడు తల్లి అంజవ్వను నెలవారి పెన్షన్ డబ్బులు తీసుకోవడం కోసం హైదరాబాద్ నుంచి సొంత గ్రామం చిన్నదేవడకు బైక్‌పై తీసుకెళ్తున్నాడు. ఈ క్రమంలో అతివేగం కారణంగా బైక్ అదుపుతప్పి ప్రమాదానికి గురైంది. దీంతో తల్లి అంజవ్వ(40) బైక్‌పై నుంచి కిందపడటంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. బైక్ నడుపుతున్న యాదు గొండకు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాన్సువాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. కూతురు దీపిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బోధన్‌లో సాయుధ బలగాల కవాతు


సాయుధ బలగాలతో కవాతు నిర్వహిస్తున్న ఏసీపీ శ్రీనివాస్

నవతెలంగాణ-బోధన్

త్వరలో జరగనున్న పార్లమెంటు ఎన్నికలను పురస్కరించుకొని సోమవారం బోధన్ పట్టణంలో సాయుధ బలగాలతో బోధన్ ఏసిపి శ్రీనివాస్ కవాతు నిర్వహించారు. అంబేద్కర్ చౌరస్తా నుంచి బోధన్ పట్టణంలోని సమస్యాత్మకమైన ప్రధాన వీధుల గుండా ఆయన సాయుధ బలగాలతో కవాతు నిర్వహించారు. ఎన్నికలు సజావుగా, శాంతియుతంగా జరగడానికి స్థానిక పోలీసులే కాకుండా కేంద్ర బలగాలు బోధన్‌కు వచ్చినట్టు తెలిపారు. కార్యక్రమంలో బోధన్ డివిజన్‌లోని పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో
మోడీ ప్రభుత్వాన్ని ఓడించండి

ఇండియా కూటమిని బలపరిచి.. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయండి

- బీజేపీ ఇచ్చిన ఏ ఒక్క హామీనీ నిలబెట్టుకోలేదు
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్ బాబు

నవతెలంగాణ-బోధన్

పార్లమెంట్ ఎన్నికలలో నరేంద్ర మోడీ ప్రభుత్వాన్ని ఓడించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్ బాబు అన్నారు. సోమవారం బోధన్ పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 13న తెలంగాణ రాష్ట్రంలో పార్లమెంటు ఎన్నికలు జరగబోతున్నాయని ఈ ఎన్నికల్లో ఇండియా కూటమిని బలపరిచి కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని కోరారు. 10 సంవత్సరాల కాలంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ప్రజల సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందని అన్నారు. కార్మికులకు కనీస వేతనాలు పెంచలేదని, ఉద్యోగ భద్రత కల్పించలేదని అన్నారు. జీఎస్టి పేరుతో ప్రజలను వ్యాపారవేత్తలను బిజెపి సర్కార్ దోచుకుందని విమర్శించారు. ప్రతి సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న మాట నిలబెట్టుకోలేదని, అలాగే రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తామన్న హామీని నిలబెట్టుకోలేదని అన్నారు. ఒకవైపు పెట్టుబడి దారుల ఆస్తులు వేల రెట్లు పెరుగుతా ఉంటే సామాన్యుడు మాత్రం దరిద్రంలోకి నెట్టబడుతూ ఉన్నారని అన్నారు. ఈ దేశ ప్రజల ఆస్తులు అయిన బ్యాంకులు, ఎల్‌ఐసి, రైల్వేలు, బొగ్గు గనులు, రక్షణ రంగం మొదలు సంస్థలను కార్పొరేట్ సంస్థలకు నరేంద్రమోడీ దోచిపెడుతున్నాడని విమర్శించారు. అంతేగాకుండా రాజ్యాంగంపై ప్రమాణం చేసి అధికారం చేపట్టిన నరేంద్ర మోడీ రాజ్యాంగానికి తూట్లు పొడుస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని అన్నారు. అన్ని మతాలకు నిలయమైన భారతదేశాన్ని మత విద్వేషాలు రెచ్చగొడుతూ ఒక మతానికి వంతపాడడం చేస్తున్నారని అన్నారు. నిత్యావసర వస్తువుల భారం సామాన్య ప్రజలపై పెరిగిందన్నారు. ప్రశ్నించే గొంతులను నొక్కుతున్నారని అన్నారు. బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడిన వారిపై ఈ.డి, సిబిఐ దాడులు జరిపిస్తూ కక్ష సాధింపులకు పాల్పడుతున్నారని విమర్శించారు. ప్రజలు అవకాశం ఇచ్చిన 10 సంవత్సరాల కాలంలో బిజెపి ప్రభుత్వం వల్ల ఈ దేశానికి ఒరిగిందేమీ లేదని అన్నారు. కావున రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం) పార్టీ కార్యదర్శివర్గ సభ్యులు శంకర్‌గౌడ్, నూర్జహాన్, జిల్లా కమిటీ సభ్యులు ఏశాల గంగాధర్, నన్నేసాబ్, పట్టణ కమిటీ సభ్యులు ఎస్.కుమారస్వామి, దాసి గోపి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం



ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంపీడీవో

నవతెలంగాణ-సదాశివనగర్

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధమని మండల పరిషత్ అభివృద్ధి అధికారి సంతోష్ కుమార్ అన్నారు. భావిభారత నిర్మాణంలో యువత ఓటర్లదే నిర్ణయాత్మక పాత్ర అని.. ఓటర్లు చైతన్యవంతులై ప్రజాస్వామ్య పరిరక్షణలో మనందరం పాలుపంచుకుని ఓటు హక్కు కలిగి ఉన్న ప్రతి ఒక్కరినీ చైతన్యవంతులను చేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడుదామని తెలిపారు. ఇన్స్‌పైర్ సొసైటీ ఫర్ రూరల్ డెవలప్మెంట్ (ఐ.ఎస్.ఆర్.డి) స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో మండల మహిళ సమాఖ్య సమావేశంలో పాల్గొని ఓటు హక్కు పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటింగ్ రోజు సెలవు దినంగా కాకుండా ఒక పండగలా ఓట్లు వేయడానికి ఓటింగ్ కేంద్రానికి వెళ్లాలని తెలిపారు. అనంతరం (ఐ.యస్.ఆర్.డి) సంస్థ ప్రధాన కార్యదర్శి అమృత రాజేందర్ మాట్లాడుతూ.. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంలో ఎన్నికలను ప్రపంచవ్యాప్తంగా కుంభమేళాగా చూడటం జరుగుతుందని, చైతన్యశీలురైన ఓటర్లే ప్రజాస్వామ్యానికి మూలస్తంభాలని తెలిపారు. భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా వినియోగించుకోవాలని అన్నారు. యువత విద్యార్థులు, ప్రజలు ఓటరు మహాశయులు నిస్తేజం వీడి ఓటింగ్ రోజు వంద శాతం ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. అనంతరం ఎంపీడీవో మహిళ సమాఖ్య అధ్యక్షులకు ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య అధ్యక్షురాలు శోభ, డి.పి.ఎం వకుళ, ఏ.పి.ఎం రాజారెడ్డి, మండల విద్యాధికారి యూసెఫ్, సీసీలు ఆంజనేయులు, లింగం, రాము, నరేందర్, కృష్ణంజలి, సౌజన్య, పర్యవేక్షణ సమాఖ్య సిబ్బంది లత, గ్రామ సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

ఒకరి రక్తదానం..
ముగ్గురికి ప్రాణదానం

- జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్

నవతెలంగాణ-కామారెడ్డి


రక్తదానం చేస్తున్న వారితో మాట్లాడుతున్న కలెక్టర్

ఒకరి రక్తదానం ముగ్గురికి ప్రాణదానమని, ఆరోగ్యవంతులైన వ్యక్తులు ముందుకు వచ్చి రక్తదానం చేయవలసినదిగా జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ కోరారు. వైద్య ఆరోగ్య, పశు సంవర్ధక, రెడ్‌క్రాస్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌లోని వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కామారెడ్డి ప్రజలు మానవతా హృదయులని, ఏ సమయంలోనైనా రక్తదానానికి ముందుకురావడం ముదావహమని అన్నారు. కుల, మత తారతమ్యాలు లేకుండా ఆరోగ్యవంతులైన వ్యక్తులు ఎవరైనా ప్రతి మూడు మా లకొకసారి రక్తదానం చేయవచ్చని, సమాజ శ్రేయస్సు కోరి నిస్వార్థంగా ముందుకు రావాలని కోరారు. రక్తదానం చేయడం వల్ల బలహీనులు కారని, గుండె జబ్బులు, క్యాన్సర్, కొలెస్ట్రాల్ వంటి జబ్బులు కూడా దరిచేరవని ఆరోగ్య సంస్థ తెలిపిందని కలెక్టర్ అన్నారు. ఆపద సమయంలో రక్తం లభించక ఎందరో ప్రాణాలు కోల్పోతున్నారని, ప్రతి ఒక్కరూ రక్తం ఇవ్వాలి, ఇప్పించుటకు ప్రోత్సహించాలన్నారు. తలసేమియాతో బాధపడుతున్న, డెంగ్యూ వల్ల ప్లేట్ లెట్స్ పడిపోతున్న వ్యక్తులకు, ప్రమాదాలలో గాయపడిన వారికి రక్తం ఎక్కించవలసి ఉంటుందని, జిల్లాలో రక్తం నిల్వలు ఉంటే వారి ప్రాణాలను కాపాడుకోగలుగుతున్నామని, అందుకే జిల్లాలో విస్తృతంగా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని, ఇందుకు స్పందన బాగున్నది అన్నారు. ఉద్యోగులు కూడా షెడ్యూల్ ప్రకారం ప్రతి నెలా రక్తదానం చేయుటకు ముందుకు రావడం సంతోషకరమని అన్నారు. ఈ శిబిరంలో 56 మంది పశుసంవర్ధక శాఖ సిబ్బంది, గోపాల మిత్రులు, 25మంది వైద్ సిబ్బంది, 12 మంది రైతులు రక్త దానం చేశారు. కాగా వివిధ ఆరోగ్య కారణాల రీత్యా 16 మంది నుంచి రక్తం సేకరించలేదని అన్నారు. రక్తదానం చేసిన వారిని ప్రశంసిస్తూ పండ్లు, బిస్కట్లు, బట్టర్ మిల్క్ వంటివి అందించారు. కామారెడ్డి, బాన్సువాడ వైద్య సాంకేతిక సిబ్బంది దాతల నుంచి రక్తం సేకరించారు. వారికి డెమో వేణుగోపాల్ భోజన సదుపాయం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి లక్ష్మణ్ సింగ్, జిల్లా పశు సంవర్ధక అధికారి సింహరావు, రెడ్‌క్రాస్ సంస్థ చైర్మన్ రాజన్న, కార్యదర్శులు రఘుకుమార్, నర్సింహం, డా.సంజయ్, డా.శ్రీనివాస్, డా.దేవేందర్, డా.శ్రేష, పోచయ్య, కిషోర్, ప్రోగ్రాం అధికారి రాధిక, డిపిఎం సుధాకర్, గోపాల మిత్రులు కృష్ణ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆప్త మిత్రుడిని కోల్పోవడం బాధగా ఉంది

- మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు

నవతెలంగాణ-బోధన్


కంటతడి పెట్టిన మండవ

తనతో టిడిపి పార్టీలో ఉన్నప్పటి నుంచి నేటి వరకు ఆప్త మిత్రుడిగా కొనసాగిన బుద్దె రాజేశ్వర్ ఆకస్మిక మరణం తనను తీవ్రంగా కలిచివేయడమే కాకుండా బాధ కలిగించిందని మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం సాలూర గ్రామంలో బుద్దె రాజేశ్వర్ కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా బుద్దె రాజేశ్వర్ చిత్రపటానికి నివాళులర్పించి కంటతడి పెట్టారు. ఎంతో భవిష్యత్తు కలిగిన నాయకుడు ఇలా ఆకస్మికంగా మృతి చెందడం జీర్ణించుకోలేని విషయమని అన్నారు. సాలూరా ఎత్తిపోతల పథకాన్ని పట్టుపట్టి సాధించిన ఆయన మొండి పట్టుదల ఎంతో ఉన్నతమైనదని దానికి గ్రామస్తుల సహకారం కూడా తోడు కావడం ఆయన గొప్పతనానికి నిదర్శనం అన్నారు. లిఫ్ట్ ఇరిగేషన్ సాధించే దశలో ఎన్నో అవంతరాలు ఎదురైనా వాటిని సాధించి కృషి చేశారన్నారు. టిడిపిలో తమతో ఉన్న కాలక్రమేణా బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరామని మా ప్రోద్బలంతో, మా సూచనతో ఆయన కూడా కాంగ్రెస్‌లో చేరారని గుర్తు చేసుకున్నారు. ఆయన కుటుంబానికి మనోధైర్యం రావాలని కోరారు. ఆయన కుటుంబ సభ్యులకు అన్ని వేళలో సహాయ సహకారాలు అందిస్తామని భరోసా కల్పించారు. ఆయన వెంట ప్రముఖ న్యాయవాది ఆజార్ కిషన్ రావు, కమ్మ సేవా సంఘం అధ్యక్షులు పల్లెంపాటి శివన్నారాయణ, కొడాలి రవికుమార్, పిఆర్టియూ ఉపాధ్యాయ సంఘం నేత ఇల్లెపు శంకర్, బాలస్వామి, నర్సయ్య బుజ్జి, గ్రామ పెద్దలు, గ్రామస్తులు ఉన్నారు.

తాగునీటి సరఫరాకు ఇబ్బందులుండొద్దు

- పకడ్బందీ చర్యలు తీసుకోవాలి
- జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్

నవతెలంగాణ-కామారెడ్డి


మాట్లాడుతున్న కలెక్టర్

తాగునీటి సరఫరాకు ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవలసిందిగా జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మిషన్ భగీరథ ఇంజనీరింగ్ అధికారులకు, ఎంపిడిఓలకు సూచించారు. సోమవారం కలెక్టరేట్ నుంచి ఇంజనీరింగ్ అధికారులు, ఎంపిడిఓలు, ఎంపీఓలతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మంచినీటి సరఫరా, అమ్మ ఆదర్శ పాఠశాలల కింద తాగునీటి సరఫరా, విద్యుత్, టాయిలెట్స్, చిన్న చిన్న మరమ్మతులు చేపట్టుటపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా తాగునీటి సరఫరాను సమీక్షిస్తూ ఎస్.ఆర్.ఎస్.పిలో నీటి లభ్యత ఉన్నదని, బల్క్‌గా నీటి సరఫరాకు ఎటువంటి ఇబ్బంది లేదని స్పష్టం చేశారు. గ్రామాలలో నీటి ఎద్దడి తలెత్తకుండా పైప్‌లైన్‌ల లీకేజి అరికట్టాలని, అవసరం మేర నూతన పైప్‌లైన్‌లు, ట్యాంకుల నిర్మాణం, నీటి కుళాయిల కనెక్షన్లు, నూతన బోర్‌వెల్స్ ఏర్పాటు, పంపుసెట్ల మరమ్మతులు, రిప్లేసిమెంట్ వంటివి శీఘ్రగతిన చేపట్టాలన్నారు. ఎంపిడిఓలు క్షేత్రస్థాయిలో గ్రామాలకు వెళ్లి పైప్‌లైన్‌లు సరిగ్గా ఉన్నాయా, పగిలిపోయి నీరు కలుషితమవుతున్నాయా, నీరు సక్రమంగా సరఫరా అవుతుందా, ట్యాంకులు శుభ్రంగా ఉన్నాయా వంటి పరిస్థితులను అధ్యయనం చేసి నీటి కొరత లేకుండా చూడాలన్నారు. జిల్లాలో ఎస్.డి.ఎఫ్. కింద బోరుబావులు, పంపుసెట్లు, పైప్‌లైన్ల నిర్మాణం వంటి 257 పనులు చేపట్టగా ఇప్పటికే 211 పనులు పూర్తి చేయడం పట్ల ఇంజనీరింగ్ అధికారులను అభినందిస్తూ మిగిలిన 46 పనులను కూడా మూడు రోజులలోగా పూర్తి చేయవలసినదిగా సూచించారు. నీటిని పొదుపుగా వాడుకోవలసిన ఆవశ్యకత కలదని దీనిపై ప్రజలలో అవగాహన కలిగించాలన్నారు. రైతులు కూడా వరికి బదులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెట్టాలని, పంట పొలాలలో 8-8 సైజ్‌లో పాంపాండ్స్ ఏర్పాటు చేసుకొని గట్టు వెంట టేకు చెట్లు పెట్టుకోవడం, చేప పిల్లల పెంపకం వంటివి చేపట్టడం వల్ల అటు ఆదాయంతో పాటు భూగర్భ జలాలు పెరిగే అవకాశముందని అన్నారు. గ్రామాలలో జాబ్ కార్డు కలిగిన రైతువారీగా వివరాలు సేకరించి ఈ విషయంపై వారిని చైతన్యవంతులను చేయాలని సూచించారు. ఉపాధిహామీ కూలీలకు వడదెబ్బ తగలకుండా నీడ, మంచినీరు, ఓ.ఆర్.ఎస్. ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాల కింద చేపట్టవలసిన పనుల గురించి సమీక్షిస్తూ జిల్లాలో వేయి పాఠశాలలో వివిధ పనులు చేపట్టేందుకు 10 కోట్ల నిధులు అందుబాటులో ఉన్నాయని అన్నారు. కాగా ఇప్పటి వరకు 196 పాఠశాలలో చేపట్టవలసిన పనులపై అంచనాలు రూపొందించి 25శాతం అడ్వాన్స్‌గా 87లక్షలు అందించామని పనులు కొనసాగుతున్నాయన్నారు. మిగిలిన పాఠశాలలో కూడా చేపట్టవలసిన పనులకు ఖచ్చితమైన అంచనాలు రూపొందించి బుధవారం లోగా నివేదికలు అందిస్తే 25 శాతం డబ్బులు విడుదలే చేస్తామని, పాఠశాలలు తెరిచేలోగా మంచినీరు, విద్యుత్, టాయిలెట్స్, స్లాబ్, ఫ్లోరింగ్, కిటికీలు, తలుపులు వంటి చిన్న చిన్న మరమ్మతు పనులు చేపట్టి అన్ని పూర్తిచేయాలన్నారు. ప్రధానంగా లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా పాఠశాలలో పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేసే పాఠశాలలో తక్షణమే లైట్, ఫ్యాన్ ఉండే విధంగా విద్యుత్ పనులు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్‌డిఓ చందర్ నాయక్, డిపిఓ శ్రీనివాస్, డీఈఓ రాజు, మిషన్ భగీరథ ఈఈ రమేష్, ఇంజనీరింగ్ అధికారులు, ఎంపిడిఓలు, ఎంపిపిలు తదితరులు పాల్గొన్నారు.

జహీరాబాద్ పార్లమెంట్ ఇన్చార్జిగా
మదన్ మోహన్‌రావు నియామకం



నవతెలంగాణ-ఎల్లారెడ్డి(లింగంపేట్)

జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల ఇన్చార్జిగా ఎల్లారెడ్డి శాసనసభ్యులు మదన్మోహన్‌రావును నియమిస్తూ కాంగ్రెస్ అధిష్టానం నియామకపత్రాన్ని సోమవారం విడుదల చేసింది. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్చార్జ్ దీపాదాస్ మున్షి ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ ఆదేశానుసారం జహీరాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జిగా మదన్మోన్‌రావును నియమిస్తూ నియామకపత్రాన్ని తెలంగాణ కాంగ్రెస్ పార్టీ విడుదల చేసింది. ఎల్లారెడ్డి శాసనసభ్యులు మదన్మోహన్‌రావుకు పార్లమెంట్ ఇన్చార్జి బాధ్యత అప్పగించడంతో కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రైతుల అభివృద్ధి కోసం కృషి చేస్తా

నవతెలంగాణ-దోమకొండ

ఉమ్మడి జిల్లా డీసీఎంఎస్ ఇంచార్జ్ చైర్మన్‌గా ఎదుల్ల ఇంద్ర సేనరెడ్డి నియామకమైన సందర్భంగా బీబీపేట్ మండల కేంద్రంలోని ఆయన నివాసంలో కాంగ్రెస్ పార్టీ మైనారిటీ నాయకులు సోమవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వారికి అందించే విధంగా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకులు మహ్మద్ అసిఫ్, బాబా పక్రొదిన్, హుసేన్ తదితరులు పాల్గొన్నారు.

అనుమానస్పదంగా యువకుడు మృతి


తోకల తిమోతి మృతదేహం

నవతెలంగాణ-రామారెడ్డి

యువకుడు అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన మండలంలోని స్కూల్ తాండ పరిసర ప్రాంతంలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్సై విజయ్ కొండ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నరసరావుపేట మండలం ఉప్పలపాడు గ్రామానికి చెందిన తోకల తిమోతి (30), వృత్తిరీత్యా వరి ధాన్యం ఆరబెట్టే తాటి పత్రాలను రైతులకు కిరాయికి ఇస్తూ మండలంలోని ఇసన్నపల్లి గ్రామంలో నివాసముంటున్నాడు. ఆదివారం ఇంటి నుంచి వెళ్లి రాత్రి వరకు తిరిగి రాలేదు. సోమవారం ఉదయం స్కూల్ తాండ పరిసర ప్రాంతంలోని రోడ్డు ప్రక్కన శవం పడి ఉందని భార్య కోటేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యం

- భారీ మెజారిటీతో గెలిపించాలి
- కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి సురేష్ షెట్కార్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మహ్మద్ షబ్బీర్ అలీ

నవతెలంగాణ-దోమకొండ


మాట్లాడుతున్న షబ్బీర్ అలీ

దేశంలో, రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి సురేష్ షెట్కార్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మహ్మద్ షబ్బీర్ అలీ అన్నారు. దోమకొండ మండల కేంద్రంలోని పెద్దమ్మ ఆలయంలో కాంగ్రెస్ పార్టీ మండల కార్యకర్తల సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఎన్నికలలో ఇచ్చిన హామీల మేరకు ప్రజల సంక్షేమానికి ఆరు గ్యారంటీల పథకాలలో ఇప్పటికే 5 పథకాలు అమలు చేశారని తెలిపారు. ఎన్నికల తర్వాత ఆగస్టు నెలలో రైతులకు 2లక్షల రుణమాఫీ చేస్తామని తెలిపారు. గత పదేండ్ల క్రితం కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నపుడు రైతులకు ఏకకాలంలో రుణమాఫీ చేశామని, నిరుపేదల కోసం ఉపాధిహామీ చట్టాన్ని ప్రవేశపెట్టి కూలీలకు పని కల్పించామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ దేశంలో అధికారంలోకి రాగానే ఉపాధి హామీ కూలీలకు రోజుకు 400 వందల రూపాయలు అందిస్తామని తెలిపారు. కామారెడ్డి నియోజకవర్గం ప్రాంతంలో తాగు, సాగునీటి ఇబ్బందులు ప్రజలు పడుతున్నారని, రైతులకు వ్యవసాయం సాగుకోసం నీటిని అందించేందుకు కృషి చేస్తానన్నారు.

గత బీఆర్ఎస్ పార్టీ పాలనలో మాజీ సీఎం కెసిఆర్, ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్ నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి పనులు చేయలేదని విమర్శించారు. కెసిఆర్ రాష్ట్రంలో కేవలం సిద్దిపేట, సిరిసిల్లా, గజ్వేల్ నియోజకవర్గాలలో మాత్రమే అభివృద్ధి చేశారన్నారు. బిజినెస్ కోసం పార్టీ కండువాలు మార్చేవారు కావాలా, ప్రజల అభివృద్ధి కోసం పాటుపడే సురేష్ శెట్కర్ కావాలో ప్రజలు ఆలోచించాలన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి సురేష్ శెట్కర్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. అనంతరం పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మహ్మద్ షబ్బీర్ అలీ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కైలాష్ శ్రీనివాస్, జడ్పీటీసీ తీర్మాల్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు అనంతరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆబ్రబోయిన స్వామి, నర్సారెడ్డి, మధు, మాజీ సర్పంచ్ అంజలి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం


గుర్తుతెలియని మృతదేహం

నవతెలంగాణ-కామారెడ్డి

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఈ ఘటన కామారెడ్డి పెద్ద చెరువు కట్ట కింద గల ఒక వ్యవసాయ బావిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. వ్యక్తి శవం నీళ్లలో పడి ఉన్నదని ఆ వ్యవసాయ భూమిని కౌలుకు చేస్తున్న కొత్తూరు రాజశేఖర్ గమనించి పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని బావిలో నుంచి తీయించారు. మృతుడి వయస్సు సుమారు (45 నుంచి 50 సంవత్సరాలు) ఉంటుంది. ఇతడు వైట్ కలర్ ఫుల్ హ్యాండ్ షర్ట్‌ను, గ్రీన్ కలర్ జీన్స్ ప్యాంట్‌ను ధరించి ఉన్నాడు. ఇతనిని పరిశీలిస్తే ముస్లిం వ్యక్తిగా అనిపిస్తుంది. ఈ వ్యక్తి దాదాపు పది నుంచి 15 రోజుల కిందట ప్రమాదవశాత్తు గానీ, లేదా మరేదైనా కారణం వల్ల గానీ బావిలో పడి చనిపోయినట్టుగా పోలీసులు భావిస్తున్నారు. మృతుని శవాన్ని తదుపరి చర్యల నిమిత్తమై, గుర్తుపట్టడం కొరకై ప్రభుత్వ హాస్పిటల్ కామారెడ్డి నందు భద్రపరిచారు. ఇతని సమాచారం తెలిసిన ఎవరైనా కామారెడ్డి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో తెలియజేయాలని పోలీసులు సూచించారు.

కాంగ్రెస్ పార్టీ నాయకుల జోరుగా ప్రచారం

నవతెలంగాణ-బోధన్


ప్రచారంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరుతూ సోమవారం బోధన్ పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు 1వ వార్డులో ఇంటింటికి జోరుగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రంలో అధికారంలో వస్తేనే ప్రజలకు సంక్షేమ పాలన అందుతుందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు హరి కాంత్ చారి, గంగాశంకర్, నాగేశ్వర్‌రావు, మాజీ చైర్మన్ ఎల్లయ్య, దాము, మాజీ సర్పంచ్‌లు వీరభద్ర రావు, బంటు సాయిలు, మాజీ ఎంపీటీసీ సురేందర్‌గౌడ్, తలారి నవీన్, రామూర్తి, శ్రీనివాస్‌రెడ్డి, గంగాధర్‌గౌడ్, ధనుంజయ్ రెడ్డి, పోలు, నరేందర్‌రెడ్డి, ఆదినారాయణ, అజ్మత్, సలీమ్, సాజీత్, ఖలీమ్ పాల్గొన్నారు.